



సోమశిలలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు,చిత్రంలో జిల్లా మంత్రులు, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు



సోమశిల జలాశయం ముందు దెబ్బతిన్న ఆప్రాన్‌ను పరిశీలిస్తున్న మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం, నారాయణ

ఐదేళ్లలో 'ఇరిగేషన్' విధ్వంసం

- సోమశిల డ్యాం కొట్టుకుపోయేలా చేశారు..
- క్రస్టుగేట్ల వ్యవస్థ అధ్వానం
- రెండు నెలల్లో పరిస్థితిని చక్కదిద్దుతాం..
- నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల

అనంతసాగరం, జూలై 14: ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇరిగేషన్‌శాఖను విధ్వంసం చేశారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఆదివారం మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలసి ఆయన సోమశిల జలాశయాన్ని సందర్శించారు. తొలుత అతిథిగృహంలో ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించి లోపాలు తెలుసుకున్నారు. అనంతరం ఆగిన ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్ నిర్మాణాలను పరిశీలించారు. తదుపరి జలాశయం ముందు దెబ్బతిన్న ఆప్రాన్ చూసి నివ్వెరపోయారు.గతంలో వచ్చిన వరదలకు ప్రాజెక్టుకు జరిగిన నష్టాన్ని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా ఫొటో ప్రదర్శన ద్వారా సోమశిల ఎగువ, దిగువ ఉన్నా జలాశయాలు, డ్యాంకు నీటిలభ్యత చేకూరే విషయాలను వారు అమాత్యులకు తెలియజేశారు.

అనంతరం మంత్రి నిమ్మల విలేకరులతో మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో జగన్ విధ్వంస పాలన సాగించి, సాగునీటి రంగాన్ని పాతాళానికి నెట్టేశారని దుయ్యబట్టారు. సోమశిలలో ఆప్రాన్ పనులు అత్యవ సరంగా చేయాల్సి ఉంటే, వాటి గురించి పట్టించుకోక పోవడంతో ప్రాజెక్టు కొట్టుకుపోయే పరిస్థితి తెచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులపై అవగాహన లేని వ్యక్తులను మంత్రులుగా నియమించాడని పేర్కొన్నారు. సోమశిల డ్యాం పటిష్టత గురించి పట్టించుకోకపోవడంతో క్రస్ట్‌గేట్ల వ్యవస్థ అధ్వానంగా మారిందన్నారు. 2014 టీడీపీ హయాంలో ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్ పనులపై చంద్రబాబు ప్రత్యేక చొరవ చూపి నిధులు కేటాయించి పనులు పురోగతిలో సాగేలా చేశారని తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ పనులు విస్మరించి రీటెండరింగ్ పేరిట కాలయాపన చేసిందని విమర్శించారు.

రెండు నెలల్లో ఆప్రాన్ పనులు

సోమశిల ఆప్రాన్ పనులకు 60 రోజుల ప్రణాళిక రూపొందించి, ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల తెలిపారు. డ్యాం వద్ద ధ్వంసమైన సోమేశ్వరుడి ఆలయానికి కూడా పూర్వవైభవం తెచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాశిం సునీల్, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరావు, ఎస్‌ఈ వెంకటరమణరెడ్డి, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ ఓవరాక్షన్

మంత్రుల రాక సందర్భంగా డ్యామ్ వద్ద బందోబస్తు నిర్వహించిన అనంతసాగరం ఎస్‌ఐ సూర్యప్రకాష్‌రెడ్డి ఓవరాక్షన్ చేశారు. మంత్రులు డ్యామ్‌పైకి రాకముందే కొంతమంది విలేకర్లు వెళ్తుండగా వారిని అడ్డుకున్నారు. అంతేకాక మంత్రి నిమ్మల రామనాయుడు కారును కూడా ఆపారు. మంత్రి మరో వాహనంలో వెళ్లారని, కారును అనుమతించాలని సిబ్బంది కోరినా ఆయన స్పందించ లేదు. కందుకూరు ఎమ్మెల్యే కారును కూడా ఆపడంతో ఎస్‌ఐ తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు మంత్రి ఆనం వ్యక్తిగత సిబ్బంది వాహనాలను కూడా అడ్డుకున్నారు. తాము ఫలానా అని చెప్పినా వినిపించుకోని ఎస్‌ఐ తీరును పలువురు బహిరంగంగానే ఖండించారు.

సాగు,తాగు నీరందించిన ఘనత టీడీపీదే !

- మంత్రి నిమ్మల రామానాయుడు

రాపూరు(డక్కిలి), జూలై 14 : ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సాగు, తాగునీరు అందించిన ఘనత టీడీపీదేనని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం ఆయన కండలేరు జలాశయాన్ని సందించారు. అనంతరం కండలేరు అతిథిగృహంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగుగంగ, సోమశిల, కండలేరు ప్రాజెక్టుల ను ప్రారంభించి, విజయవంతంగా పూర్తిచేసిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్‌దేనన్నారు. నేడు జిల్లాలో సాగు, తాగునీటికి కొరత లేకపోవడానికి ఎన్టీఆర్, చంద్రబాబుల కృషే కారణమన్నారు.

ఆయన చేసిందేమీ లేదు..

జిల్లాలో జలవనరుల శాఖమంత్రిగా పనిచేసిన ఒకాయన జిల్లాకు ఇరిగేషన్‌పరంగా చేసింది శూన్యమన్నారు. బుల్లెట్లు దింపడం తప్ప.. గుక్కెడు నీళ్లు ఇచ్చిందిలేదని దుయ్యబట్టారు. ఎన్‌డీఏ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పారు. ఏ రైతు నష్టపోకుండా ప్రతి ఎకరానికి నీరు ఇవ్వాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని చెప్పారు. జగన్ చేతగానితనంతో అన్నమయ్య ప్రాజెక్టు ఆనకట్ట కొట్టుకుపోయిందన్నారు. సోమశిల కూడా కొట్టుకుపోయే పరిస్థితి వచ్చిందన్నారు. కండలేరులో దెబ్బతిన్న పనులకు రూ.16 కోట్లు వెంటనే మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. తెలుగుగంగ హైలెవల్ కెనాల్స్ ను కూడా పరిశీలించామన్నారు. వాటి మరమ్మతులకు అవసరమైన సూచనలు కూడా ఇంజనీర్లకు ఇచ్చామన్నారు. లష్కర్లకు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించడంతోపాటు వారిని విధుల్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నామని నిమ్మల చెప్పారు. ముంపు గ్రామాలకు నుంచి వచ్చే అర్జీలను ప్రాధాన్యం ఇస్తామన్నారు. సమీక్షలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్వేపల్లి, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశిం సునీల్, విజయశ్రీ, కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, జిల్లా కలెక్టరు ఆనంద్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కండలేరు జలాశయ అతిథి గృహంలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల, చిత్రంలో ఆనం, నారాయణ తదితరులు

- జిల్లాలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు
- రోజుకో హత్యాయత్నం... రెండురోజులకో హత్య
- రౌడీషీటర్లు, పాత నేరస్థులతోనే అరాచకాలు
- పంచాయితీ కేంద్రాలుగా పోలీసుస్టేషన్లు
- నగరంలో నిత్యం ట్రాఫిక్ కష్టాలే...
- అవినీతికి కేరాఫ్‌గా సెబ్
- ఎస్‌బి ప్రక్షాళనకు అడుగులు పడేనా ?
- నేడు కొత్త ఎస్పీ బాధ్యతల స్వీకరణ
- కృష్ణకాంత్‌పైనే జిల్లా వాసుల ఆశలు

కృష్ణా... మము కావవా ?



ప్రశాంతతకు మారుపేరుగా నెల్లూరు జిల్లా పేరుగాంచింది. అందుకనే ఈ జిల్లాలో జీవించాలని దేశంలోని ఎంతోమంది కోరుకుంటారు. ఓ ఇల్లో.. స్థలమో కొనిపెట్టుకుని జీవిత చరమాంకంలో ప్రశాంతంగా ఇక్కడ ఉండాలనుకుంటారు... అయితే ఇదంతా గతం... కొన్నేళ్లుగా జిల్లా అశాంతికి అడ్డాగా మారిపోయింది. రోజుకో హత్యాయత్నం, రెండు రోజులకొక హత్య... నిత్యం, గొడవలు, దొంగతనాలు, సైబర్ నేరాలు, వేధింపులు... ఇలా నేరాలకు, ఘోరాలకు నిలయంగా మారింది. ఈ క్రమంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ)గా కృష్ణకాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లాలో శాంతిభద్రతలను ఆయనైనా గాడిన పెడతారని, జిల్లాకు పూర్వవైభవం తీసుకువస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

- నెల్లూరు(క్రైం)

గత వైసీపీ ప్రభుత్వంలో నాయకుల అండదండలతో రౌడీషీటర్లు పోలీసుస్టేషన్లలో కూర్చొని పంచాయితీలు చేసే స్థాయికి చేరుకున్నారు. పోలీసుఅధికారులు సైతం నాయకుల మన్ననలు పొందేందుకు రౌడీషీటర్లు చెప్పిందే వేదం అంటూ అడుగులు వేసేవారు. ప్రభుత్వం మారినా వారి తీరులో పెద్దగా మార్పు కనిపించడం లేదు. జిల్లాలో హత్యలు, హత్యాయత్నాల కేసుల్లో నిందితులు ఎక్కువగా రౌడీషీటర్లు, పాత నేరస్థులే ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో నేరం చేసి జైలుశిక్ష అనుభవించిన వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచేవారు. జైలు నుంచి బయటకు వచ్చినవారు ఎక్కడున్నారు..ఏం చేస్తున్నారు...? వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచేవారు. అయితే ఇప్పుడు అలాంటివేమీ కనిపించడం లేదు.

కత్తులతో తిరుగుతున్నా..

జిల్లాలోని నేరచరితులకు పోలీసులంటే పూర్తిగా భయంపోయింది. జేబుల్లో కత్తులు, బ్లేడులు పెట్టుకొని తిరగడం ప్రస్తుతం వారికి ఫ్యాషన్‌గా మారిపోయింది. నెల్లూరు నగరంలో మద్యం కోసం నగదు ఇవ్వకపోతే కత్తులతో బెదిరించడం, దాడి చేయడం, చివరకు హత్య చేయడం చేస్తున్నారు. చిన్నచిన్న కారణాలతో వెంటాడి ప్రాణాలు తీస్తున్నారు. జనసంచారం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కుటుంబసమేతంగా ఒంటరిగా వెళ్లాలంటే భయపడే పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. మాదక ద్రవ్యాల వాడకం విచ్చలవిడిగా పెరిగింది. గంజాయికి అడ్డాగా మారిపోయింది. డ్రగ్స్‌ను సైతం ఇటీవల పోలీసులు పట్టుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇక పేకాట,వ్యభిచారాలకు జిల్లాలో అడ్డూఅదుపూ లేదు. జిల్లాలోని కొందరు పోలీసు అధికారులే నెలవారీమామూళ్లు తీసుకొని వీటికి అండగా ఉంటున్నట్లు సమాచారం.

ట్రాఫిక్ కష్టాలకు తీరేనా ?

నెల్లూరు నగరంలో ప్రజలు నిరంతరం ఎదుర్కొనే అతి పెద్ద సమస్య ట్రాఫిక్. ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వరకు నిత్యం ట్రాఫిక్ కష్టాలు ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. పార్కింగ్ ప్రాంతాలు లేకపోవడం, నిబంధనలు పాటించకపోవడం, మాటలకే పరిమితమైన సిగ్నల్ వ్యవస్థ, అక్రమంగా ఆటో స్టాండ్లు, ఇష్టానుసారంగా తిరిగే సిటీ బస్సులు, వేల కొద్ది ఆటోలతో నగరంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకి జఠిలమవుతోంది. ఈ సమస్యను పరిష్కరించడం ఇటు నాయకుల వల్ల, అటు అధికారుల వల్ల కావడం లేదు. కొత్తగా బాధ్యతలు చేపట్టే జిల్లా ఎస్పీ అయినా ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

స్టేషన్లలో మర్యాద కరువు

పోలీసుస్టేషన్లలో పోలీసులు ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగాలని పలు సమావేశాల్లో పోలీసు అధికారులు పదే పదే చెబుతుంటారు. అయితే జిల్లాలోని స్టేషన్లలో అడుగు పెట్టాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోని సంఘటనలు ఎన్నో ఉన్నాయి. విచారణ సమయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. స్టేషన్‌లో అడుగుపెడితే రూ. 5వేలు వదిలించుకో వాల్సిందేనన్న రీతిలో జిల్లాలోని పోలీసుస్టేషన్లు ఉన్నాయి.

అవినీతి ఆరోపణలతో సెబ్

ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖను రెండు విభాగాలుగా చేసి సెబ్‌ను ఏర్పాటు చేశారు. సెబ్ పర్యవేక్షణ సైతం పోలీస్ బాస్ పైనే ఉంటుంది. జిల్లాలో ప్రస్తుతం సెబ్‌పై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణ, మైనింగ్, అధిక మద్యం తరలించడం.. ఇలా అన్నింటిలోనూ సెబ్ అధికారులు నెలవారీ మామూళ్ల వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటికి అడ్డుపడేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఎస్‌బీ ప్రక్షాళనకు అడుగులు పడేనా ?

జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్యూరో (ఎస్‌బీ) సిబ్బంది మొత్తం ఇప్పటివరకు వైసీపీ నాయకుల కనుసైగల్లో నడుస్తుండేవారు. ఎన్నికలకు ముందు టీడీపీ నేతలు నేరుగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా ఎస్‌బీలో మాత్రం పెద్దగా ప్రక్షాళన జరిపేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కృష్ణకాంత్ అయినా ఎస్‌బీ ప్రక్షాళన వైపు అడుగులు వేస్తారో లేదో చూడాలి.

ఏళ్ల తరబడి అక్కడే... !

ఇక జిల్లావ్యాప్తంగా కొన్ని పోలీసుస్టేషన్లను అడ్డాగా చేసుకొని నాన్ యూనిఫాంలో ఉన్న సిబ్బంది అంతా అక్కడే పాతుకుపోయారు. వారికి బదిలీలు ఉండవు.ఒకవేళ బదిలీలు చేసినా మళ్లీ అదే స్టేషన్లకు సిఫార్సుల ద్వారా చేరిపోతున్నారు. ఇలాంటి వారు పోలీసుశాఖలోని పలు విభాగాల్లో పాతుకుపోయి ఉన్నారు. వారిపై సైతం ఎస్పీ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏది ఏమైనా కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న జిల్లా పోలీసు బాస్‌పై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారు.



రొట్టెల పండుగకు ముస్తాబైన బారాషహీద్ దర్గా

బారాషహీద్ దర్గాకు పండుగ కళ

- తరలివస్తున్న ప్రజానీకం
- స్వర్ణాల చెరువులో పవిత్ర స్నానాలు
- రొట్టె పట్టి మొక్కు తీర్చుకుంటున్న భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 14: నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గాకు పండుగ కళ వచ్చింది. విశేషంగా జరిగే రొట్టెల పండుగ ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్నది. అయితే ఆదివారం నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. ఇప్పటికే దేశం నలుమూలల నుంచేకాక విదేశాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలి వస్తున్నారు. భక్తులు ముందుగా స్వర్ణాల చెరువు ఘాట్ వద్ద పవిత్ర స్నానాలు చేసి కోర్కెల రొట్టెను పట్టుకుంటున్నారు. అనం తరం దర్గాలో బారాషహీద్‌లకు పూజలు చేసి మొక్కు చెల్లించుకుంటున్నారు. దీంతో ఆ ప్రాంతంఅంతా జనంతో నిండిపోయింది. పండుగ ఏర్పాట్లలో భాగంగా దర్గా మైదానం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగురంగుల దీపాలంకరణలతో దర్గా కళకళలాడుతోంది. దర్గా మైదానంలో వేలాది అంగళ్లు ప్రారంభమయ్యాయి. వస్త్రాలు, కొబ్బరికాయలు, ఫుడ్‌కోర్టులు, వివిధ రకాల సామాన్లతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. దుకాణాల్లో మహిళలకు సంబంధించిన వంటసామగ్రి, గాజులు, రకరకాల బొమ్మలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అలాగే రెయిన్ కోట్లు, ట్రావెల్ బ్యాగులు తదితర షాపులతో మైదానం కళకళలాడుతోంది. ఆదివారం ఉదయం నుంచి వర్షం కారణంగా భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పండుగకు మూడు రోజుల ముందే భక్తులు భారీ సంఖ్యలో రావడంతో వారికి సౌకర్యాలు కోసం మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు. నగరంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాల్లో యాత్రికులకు వసతులు కల్పించారు. దర్గా కమిటీ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, కమిటీ సభ్యులు దర్గా మైదానంలో పర్యటిస్తూ భక్తులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు



దర్గా కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆధ్యాత్మిక కేంద్రంగా బారాషహీద్ దర్గా

- దర్గా కమిటీ ప్రమాణ స్వీకార సభలో మంత్రులు

ఆధ్యాత్మిక కేంద్రంగా బారాషహీద్ దర్గాను తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి బారాషహీద్ దర్గా వద్ద దర్గా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. అనంతరం జరిగిన సభలో మంత్రులు ఆనం, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ రొట్టెల పండుగకు ఏటేటా భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తున్నదని తెలిపారు. గతంలో ఒక్కరోజు జరిగే ఈ పండుగ ప్రస్తుతం ఏడు రోజులకు చేరిందని తెలిపారు. దర్గాలో పెద్ద మసీదు నిర్మాణాన్ని కూడా రానున్న ఐదేళ్లలో పూర్తి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. రానున్న రోజుల్లో కోటి మంది భక్తులు హాజరయ్యేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ గతంలో తాను మున్సిపల్ శాఖామంత్రిగా ఉన్నప్పుడు భక్తుల కోరిక మేరకు స్వర్ణాల ఘాట్ నిర్మాణం, శాశ్వత మరుగుదొడ్లు, వసతిగృహాల నిర్మాణం చేపట్టామన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ భక్తితో భక్తులకు సేవలు అందిస్తే దేవుడి ఆశీస్సులు అందరికీ లభిస్తాయన్నారు. మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రొట్టెల పండుగకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించిందన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ప్రజలందరికీ రొట్టెల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రొట్టెల పండుగ గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం దర్గా కమిటీ అధ్యక్షుడిగా ఖాదర్‌బాషా ప్రమాణ స్వీకారం చేశారు. తదుపరి 70 మంది కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, టీడీపీ అధికార ప్రతినిధి సాబీర్‌ఖాన్, నాయకులు సయ్యద్ సమీ, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



దర్గా కమిటీ చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న ఖాదర్‌బాషా

కావలి ఆటోనగర్‌లో ఆక్రమణలు

- ప్రభుత్వస్థలంలో యథేచ్ఛగా షోరూమ్‌ల ఏర్పాటు
- మామూళ్ల మత్తులో తూలుతున్న అధికారులు



ఆటోనగర్ ట్రంకురోడ్డు వద్ద వెలసిన భారీ షోరూమ్‌లు

కావలిటౌన్, జూలై 14: పేదలయిన ఆటో కార్మికుల బతుకుదెరువు కోసం ప్రభుత్వం ఉచితంగా కేటాయించిన స్థలంలో బడాబాబుల భారీ షోరూమ్‌లు వెలశాయి. ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నా సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో తూలుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణంలో కాలుష్యం పెరిగిపోతుండడంతో 1993లో ప్రభుత్వం ముసునూరు మందాటి చెరువు కట్ట ఇవతల టంకురోడ్డు వద్ద ఉన్న స్థలాన్ని ఆటోనగర్‌కు కేటాయించింది. వివిధ ఇంజనీరింగ్ పనులు చేసుకుని జీవించే సుమారు 200మంది కార్మికులకు నాలుగు అంకణాల చొప్పున ఇక్కడ స్థలాలు పంపిణీ చేసింది. పట్టణం దినదినాభివృద్ధి చెందుతుండగా ట్రంకురోడ్డులో అంకణం స్థలం రూ. 10లక్షల నుంచి రూ. 40లక్షల వరకు పలుకుతోంది. ముసునూరు కూడా పట్టణంలో విలీనం కాగా అక్కడ కూడా భూములకు రెక్కలొచ్చాయి. భూముల విలువ రూ. కోట్లు పలకడంతో బడాబాబుల చూపు ఆటోనగర్‌పై పడింది. ఆటో కార్మికులకు డబ్బు ఆశ చూపి ఆస్థలాలను కారుచౌకగా కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన కొంత స్థలాన్ని ఆసరాగా చేసుకుని, మరికొంత స్థలాన్ని ఆక్రమించి భారీ షోరూమ్‌లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టారు. ఆ భవనాలను బాడుగలకు ఇవ్వడం, రూ.లక్షలు ఆర్జించడం చేస్తున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

ఆటోనగర్‌లోని ప్రభుత్వ భూమిని అమ్మకూడదు కొనకూడదు. ప్రభుత్వ భూమిని ఆక్రమించకూడదు. అయితే పేద ప్రజలు నిబంధనలకు వ్యతిరేకంగా చిన్నపాటి తప్పులు చేస్తే వెంటనే చర్యలు తీసుకునే అధికారులు ప్రభుత్వ భూముల్లో బడాబాబులు భారీ భవనాలు నిర్మిస్తుంటే మాత్రం చోద్యం చూస్తున్నారు. నిర్మాణాల ప్రారంభంలో మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు అక్కడ వాలిపోయి బోర్డులు పెడతారు. అనంతరం మామూళ్లు పుచ్చుకుని వారే బోర్డులు పీకేస్తారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సింగపేటలో భారీ చోరీ

- రూ. 2 లక్షల నగదు, 25 సవర్ల బంగారం అపహరణ



బాధితురాలిని విచారిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

అల్లూరు, జూలై 14 : మండలంలోని సింగపేటలో ఓ ఇంట్లో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. కావలి డీఎస్పీ వెంకటరమణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సింగపేటలో వెంకటరమణమ్మ అనే మహిళకు రెండు పోర్షన్ల ఇల్లు ఉంది. ఒక పోర్షనుకు తాళాలు వేసి మరో పోర్షనులో రాత్రి నిద్రిస్తుంటుంది. అదేవిధంగా శనివారం రాత్రి తాళాలు వేసి మరో పోర్షనులో నిద్రించింది. ఆదివారం ఉదయం లేచి తాళాలు తీసి ఇంటి లోపలికెళ్లేసరికి చోరీ జరిగినట్లు ఆమెకు అనుమానం వచ్చింది. దీంతో బీరువాలో పరిశీలించగా తాను దాచుకున్న రూ. 2 లక్షల నగదు, 25 సవర్ల బంగారం కనపడలేదు. దీంతో ఆమె గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని నిర్ధారణకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో డీఎస్పీ ఆధ్వర్యంలో కావలి రూరల్ సీఐ నాగభూషణం, అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డిలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలు, చుట్టుపక్కల వారి నుండి వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు. తెలిసిన వ్యక్తులే మారు తాళాలతో చోరీకి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

గుప్తనిధుల కోసం పురాతన మండపం కూల్చివేత



గుప్తనిధుల కోసం కూల్చిన మండపం

కలిగిరి, జూలై 14: మండలంలోని వెలగపాడు గ్రామంలోని శ్రీ పార్వతి మల్లేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన పురాతన మండపాన్ని గుప్త నిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీ యంత్రంతో తవ్వేసిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రామక్రిష్ణ ఆదివారం తెలిపిన వివరాల మేరకు.. గ్రామ శివార్లలో పురాతన శివాలయానికి చెందిన మండపం పరిసరాలలో కొంతకాలం క్రితం గుర్తుతెలియని వ్యక్తులు తవ్వకాలు చేశారన్నారు. అక్కడ వారికి ఏమీ లభ్యం కాకపోవడంతో తిరిగి శనివారం రాత్రి జేసీబీతో మండపాన్ని కూల్చివేశారన్నారు. ఈఘటనపై కలిగిరి పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు ఆయన తెలిపారు.

గొలగమూడిలో వ్యక్తి అనుమానాస్పద మృతి

- ఉరి వేసి చంపారని మృతుడి భార్య ఫిర్యాదు

వెంకటాచలం, జూలై 14: గొలగమూడికి చెందిన కంటేపల్లి వెంకయ్య (34) ఆదివారం అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఈయన నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ వద్ద పూలమార్కెట్‌లో పనిచేస్తున్నాడు. పదేళ్ల క్రితం జ్యోతిమ్మతో వివాహం కాగా వీరిద్దరికి ఇద్దరు సంతానం. గ్రామంలో కొత్తగా నిర్మించే ఇంట్లోకి స్థానికంగా పెయింట్ పనిచేసే యువకుడితో కలిసి వెంకయ్య ఆదివారం మధ్యాహ్న సమయంలో వెళ్లాడు. అయితే అక్కడ ఇరువురి మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. కొద్దిసేపటికి వెంకయ్య తాడుతో ఉరి వేసుకుని అనుమానాస్పదరీతిలో వేలాడు తూ ఉన్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు తెలిపారు. వారు వెంకయ్యను నెల్లూరుకు తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. పెయింట్ పనిచేసే యువకుడిపై తనకు అనుమానం ఉందని మృతుడి భార్య జ్యోతమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తాం

- ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 14: మెజారిటీ ఉద్యోగులు కోరుకున్న ప్రభుత్వమే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వానికి ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ సహకరిస్తుందని ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ నిర్మాణ సభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు అంశాల గురించి వివరించారు. అనంతరం జిల్లా ఆర్టీసీ ఈయు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడుగా వై యుగంధర్, జిల్లా కార్యదర్శిగా ఓవీ ప్రసాద్, మరో 18 మది సభ్యులతో కమిటీని ఎంపిక చేశారు.

జరభద్రం గురూ..

పరికుంటపాడు, జూలై 14: మండల కేంద్రం నుంచి తూర్పుబోయమడగల మీదుగా నూతనంగా నిర్మించిన లింకు రోడ్డు గుంతలమయంగా ఉంది. సమీరంలోని ఆంజనేయస్వామి ఆలయం, నివాసాలు ఉండడంతో అటుగా రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు విసు గెత్తిపోతున్నారు. రోజుల తరబడి వర్షపు నీరు నిల్వ ఉంటుండడంతో దోమలకు నిలయంగా మారి దుర్వాసన భరింలేక పోతున్నామంటూ వాపోతున్నారు. రాత్రి సమయాల్లో పరిస్థితి మరీంత దారుణంగా మారుతుందని వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్నా పట్టించుకొనే రోడ్డు మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	131
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	264
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6972
వెండి కిలో ధర	రూ. 94,900
వెండి ఒక గ్రాము	రూ. 96.90

'ఉపాధి' అక్రమాలు బయటపడేనా?

- నామమాత్రంగా సోషల్ ఆడిట్
- తనిఖ బృందాలపైనే అవినీతి ఆరోపణలు



ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీలు (ఫైల్)

కలువాయి, జూలై 14 : ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతి, అక్రమాలు వెలికితీయడంతోపాటు తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు చేపట్టిన సోషల్ ఆడిట్ ఉద్దేశం నీరుగారిపోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో సోషల్ ఆడిట్ నామమాత్రంగానే సాగింది. పథకాన్ని అమలు చేసే క్షేత్రస్థాయి సిబ్బందితో సోషల్ ఆడిట్ విభాగం అధికారులు కుమ్మక్కై తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సోషల్ ఆడిట్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్సంటేజీలు దండుకునేందుకు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొదట్లో గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది సోషల్ ఆడిట్ అంటేనే హడలిపోయేవారు.ఇటీవల చేసిన ఆడిట్‌లో కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఏదో ఒకటి చిన్న చిన్న తప్పులు చూసి.. పథకంలో జరిగిన అక్రమాలు, అవినీతిని ఆడిట్ సిబ్బందే దాచిపెట్టినట్లు విమర్శలు ఉన్నాయి.

అక్రమాలు బయటకు వచ్చేనా ?

కలువాయి మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన రూ.10.96కోట్లు పనులపై 16వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు సిబ్బంది సిద్ధమవుతున్నారు. ముందుగా ఈ ఏడాదిలో జరిగిన పనుల రికార్డులు ఆడిట్ సిబ్బంది స్వాధీనం చేసుకుని పరిశీలన జరుపుతున్నారు. కాగా మండలంలో ఇటీవల ఉపాదిలో పెద్ద ఎత్తున జరిగిన అవినీతి, అక్రమాలు బయటపడ్డాయి. ఒక్క చిన్నగోపవరంలోనే రూ.25లు అవినీతి జరిగినట్లు అధికారులు లెక్కలు తేల్చారు. గ్రామంలో జరిగిన పనులపై ఉపాధి అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో ఆయన గ్రామానికి వచ్చి విచారణ జరపడంతో ఈ అవినీతి వ్యవహారం వెలుగు చూసింది. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, ఇతరుల జాబ్‌కార్డులలో బయట ప్రాంతాలకు చెందిన వారి పేర్లు చేర్పించి వారందరూ ఉపాధి పనులకు వెళ తున్నట్లు బోగస్ మస్టర్లు వేసుకుని నిధులు స్వాహా చేశారు. ఇలా 134 జాబ్‌కార్డుల్లో బయట ప్రాంతాలకు చెందిన వారి పేర్లు చేర్పించి బోగస్ మస్టర్లు వేసినట్లు కూడా నిర్ధారణ చేశారు. అయితే ఈ వ్యవహారంలో ఒక క్షేత్రసహాయకుడిపై మాత్రమే అధికారులు చర్యలు తీసుకున్నారు. నిధులు రికవరీకి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ప్రలోభాలకు లొంగం

కలువాయిలో చేపట్టిన సోషల్ ఆడిట్‌ను నిష్పక్షపాతంగా నిర్వహిస్తాం. ఎలాంటి ప్రలోభాలకుగానీ, పైరవీలకు తావివ్వకుండా పనులపై పారదర్శకంగా తనిఖీలు నిర్వహిస్తాం.

- సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్సు పర్సన్ నీలకంఠ

సోమశిలలో 9.900 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 14: సోమశిల పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారానికి డ్యాంలో 9.900 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 60 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

వెంకటేశ్వరపురం వైపు రాకపోకలు బంద్

- రెండు మార్గాల్లో దారిమళ్లింపు
- నెల్లూరు ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ చౌదరి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 14 : నెల్లూరు వెంకటేశ్వరపురం వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి దెబ్బతిన్న నేపథ్యంలో పూర్తిగా రాకపోకలు నిలిపివేశామని, ఇందుకు వాహనదారులు సహకరించాలని ఎన్‌హెచ్ఏఐ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) ప్రాజెక్ట్ డైరెక్టర్ చౌదరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప, కర్నూలు, ఆత్మకూరు, వైపు నుంచి వచ్చే వాహనాలు బుచ్చి నుంచి జొన్నవాడ మీదుగా నెల్లూరు నగరంలోకి దారిమళ్లించినట్లు తెలిపారు. అదేవిధంగా కావలి వైపు నుంచి కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారి నుంచి ముంబై జాతీయ రహదారిపై ఆత్మకూరు, కడప వైపు వెళ్లే వాహనాలను ఇనమడుగు కూడలి మీదుగా కోవూరు సాయిబాబాగుడి, కోవూరుటౌన్‌లో నుంచి సాలుచింతలు, బుచ్చి మీదుగా దారిమళ్లించినట్లు తెలిపారు. బ్రిడ్జిపై మరమ్మతులు చేసేంత వరకు వాహనదారులు సహకరించాలని కోరారు.

మత్స్యశాఖ ఏడీపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు

కలువాయి, జూలై 14: మత్స్యశాఖ కావలి ఏడీ శ్రీనివాసులుపై కలెక్టర్‌కు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఫిర్యాదు చేశారు. కలువాయి చెరువులో చేపల వేటకు అనుమతి లేని సమయంలో కలువాయి జెడ్పీటీసీ బి.అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులు కొందరు చెరువులో ఉన్న రూ.2కోట్లు విలువ చేసే చేపలు దొంగతనంగా పట్టించి విక్రయించారని, దీనికి మత్స్యశాఖ అధికారి శ్రీనివాసులు పూర్తిగా సహకరించారని ఎమ్మెల్యే ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై కలువాయి మత్స్య సొసైటీ మాజీ అధ్యక్షులు వజ్రాల శ్రీనివాసులు మత్స్యశాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో జెడ్పీటీసీని వారి అనుచరులను వదిలేసి మిగిలిన కొంత మందిపై మాత్రమే కేసులు పెట్టి మత్స్యశాఖ అధికారి చేతులు దులుపుకున్నారని తెలిపారు. చేపలు దొంగతనంపై సమగ్ర విచారణ జరిపి అసలైన దోషులపై కేసులు నమోదు చేసి, సహకరించిన అధికారిపై కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు.

రేపు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం

నెల్లూరు(విద్య), జూలై 14 : జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం ఈనెల 16వ తేదీన నగరంలోని డీకే బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు, యూడైస్‌ప్లస్, అఫ్లియేషన్స్ వంటి అంశాల వివరాలతో సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు. జిల్లా వృత్తి విద్యాధికారి, యూడైస్ రీసోర్స్ పర్సన్లు హాజరయ్యే ఈ సమావేశానికి ప్రిన్సిపాళ్లు తగిన సమాచారంతో తప్పక హాజరు కావాలని తెలిపారు.

వర్షంతో చల్లబడ్డ వాతావరణం

- జిల్లాలో 15.1 మి.మీ వర్షం

నెల్లూరు(హరనాథపురం), జూలై 14 : జిల్లాలో శనివారం రాత్రి, ఆదివారం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. చల్లని గాలులు వీస్తున్నాయి. ఆదివారం చిరుజల్లులతో రోడ్లపై నీరు చేరింది. రైల్వే అండర్ బ్రిడ్జిలలో నీరు చేరింది. వర్షపు నీరు నిండటంతో గుంతలమయమైన రోడ్ల మీద ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇళ్ల ముందున్న సైడ్ కాలువల్లో చెత్తను సకాలంలో తొలగించక పోవడం వలన మురుగునీరు ఇళ్ల ముందే నిలబడి ఉంది. నెల్లూరు నగర శివారు ప్రాంతాలతో పాటు, ఇళ్ల మధ్యన ఉంటే ఖాళీ స్థలాల్లో మురుగునీరు వచ్చి చేరింది.

15.1 మి.మీ వర్షపాతం నమోదు

జిల్లాలో ఆదివారం 15.1 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా దగదర్తిలో 63.8 మిమీ వర్షం పడగా, అత్యల్పంగా వరికుంటపాడులో 2.6 మిమీ వర్షం పడింది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కావలి రూరల్, జూలై 14: అనారోగ్యంతో బాధపడుతూ మనస్థాపం చెంది ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఆయేషా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. 1వ పట్టణ పోలీసుల వివరాల మేరకు... కావలి పట్టణం ఇస్లాంపేటకు చెందిన అహ్మద్ బాషాతో ఆయే షాకు 15 సంవత్సరాల క్రితం వివాహం కాగా, వారికి ఇద్దరు పిల్లలున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయే షా ఈనెల 8వ తేదీన ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వెద్యం కోసం నెల్లూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి సయ్యద్ రఫి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతులకు గుర్తింపు

- కార్డుల జారీకి ప్రభుత్వ ఆదేశాలు
- గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ



పంట సాగుకు దుక్కి దున్నుతున్న రైతు

ఉదయగిరి రూరల్, జూలై 14: ఖరీఫ్‌లో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు గ్రామాల్లో సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలోని 37మండలాల్లో 38,330 వేల మంది కౌలు రైతులు ఉన్నారు. వీరు భూ యజమానుల నుంచి పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఎకరాకు భూమి స్వభావాన్ని బట్టి రూ.15 నుంచి రూ.20వేలు వరకు యజమానికి చెల్లిస్తారు. అయితే విపత్తుల సమయంలో ఇలా భూములను సాగు చేసిన రైతులకు తీవ్ర నష్టం జరిగేది. భూమి యాజమాన్య హక్కులు ఉండక పోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు అందక వ్యవసాయ పెట్టుబడుల కోసం అప్పులు చేసేవారు. తీరా పంట చేతికందే సమయంలో విపత్తులు వస్తే తీవ్రంగా నష్టపోయేవారు. ఈ తరుణంలో ఎన్డీయే ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే కౌలు రైతులను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే గ్రామాల్లో సభలు నిర్వహించి రైతుల గుర్తించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. భూ యజమాని హక్కులకు భంగం కలగకుండా కౌలు రైతులకు 11నెలల కాలపరిమితికి గుర్తింపు కార్డులను జారీ చేయనుంది. భూ యజమాని అంగీకారంతోనే వీటిని ఇవ్వనుంది. గుర్తింపుకార్డు కోసం భూ యజమాని పొలం పాసుపుస్తకం, 1బీ వీటితో పాటు భూ యజమాని, కౌలు రైతుల లబ్ధిదారుల జెరాక్స్, ఫోటోలు ఉండాలి. భూ యజమానికి ఏ సర్వే నెంబ ర్‌లో ఎంత భూమి కౌలుకి ఇచ్చారో వివరాలు నమోదు చేస్తూ ఆయన అంగీకరించినట్లు సంతకం చేసి ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.

ప్రయోజనాలివే: ఈ ఏడాది ఖరీఫ్, రబీకి సంబంధించి పొలం కౌలు సాగు చేసే ప్రతి రైతుకు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డు తీసుకోవాలి. కౌలుదారులకు గుర్తింపు కార్డు ఉంటే పంట నమోదుకు వీలుంటుంది. తద్వారా ప్రభుత్వ పథకాలు భూ యజమానులతో పాటు కౌలు రైతులకు కూడా వర్తిస్థాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఉంటే రైతుభరోసాకు అర్హులు. పంటను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చు. పంట నష్టం జరిగితే పరిహారం, బీమా పొందేందుకు వీలుంటుంది.

గ్రామసభలు నిర్వహిస్తున్నాం

ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో రెవెన్యూ, వ్యవ సాయ సిబ్బంది కౌలు రైతుల గుర్తింపుకు గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే పలు పంచాయతీల్లో దరఖాస్తులు స్వీకరించాం. ఆయా మండలాల్లో 2,423 మందికి కౌలు రైతు గుర్తింపు కార్డులు మంజూరు చేయడమే లక్ష్యమే.

- పీ.చెన్నారెడ్డి, ఏడీఏ, ఉదయగిరి

ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి విజయంపై హర్షం

- ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ నేతల సంబరాలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

నెల్లూరు వైద్యం), జూలై 14 : దేశ వ్యాప్తంగా 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి 10 స్థానాల్లో ఘనవిజయం సాధించటంపై కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం నెల్లూరు నగరంలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉపఎన్నికల ఫలితాలు చూస్తుంటే బీజేపీ పతనం ప్రారంభమైందని తెలుస్తుందన్నారు. దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అనేక విజయాలు సాధిస్తుందన్నారు. అయితే లోక్‌సభలో రాహుల్ ప్రశ్నిస్తుంటే అవి పిల్ల చేష్టలుగా బీజేపీ విమర్శించడం దుర్మార్గమ న్నారు. మోదీ పదేళ్ల పాలనలో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ దేశ సంపదనంతా ధనికులకే కట్టపెడుతున్నారని దుయ్యబట్టారు. బీజేపీ మ్యానిఫెస్టోలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పినా పదేళ్లుగా మౌనంగా ఉండిపోయారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు పోలవరం కేంద్రమే పూర్తి చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వెంకట్రావ్, శ్రీనివాసులరెడ్డి, ఫయాజ్, తిరుపతయ్య, సంజయ్ కుమార్, హుస్సేన్‌బాషా, మోహన్, గణేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పొర్లుకట్టలు పటిష్టపరచాలి

- ఇరిగేషన్ మంత్రికి కోవూరు ఎమ్మెల్యే నివేదిక



ఇరిగేషన్ మంత్రి నిమ్మలను కలిసి సాగునీటి సమస్యలపై నివేదిక అందజేసిన కోవూరు ఎమ్మెల్యే

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 14: బుచ్చిరెడ్డిపాళెంలోని నీటి పారుదల సమస్యలను ఇరిగేషన్ శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వివరించారు. బుచ్చి మండలంలో పెన్నా పరీవాహక ప్రాంతంలోని పొర్లుకట్టలు పటిష్టపరచి వరద ముంపునకు గురికాకుండా వుండేలా పొర్లుకట్టలు పటిష్టపరచాలని కోరారు. ప్రధానంగా కనిగిరి రిజర్వాయర్ నుంచి సాగునీరు పారుదలయ్యే పైడేరు ఎస్కేప్ ఛానల్, ఈస్టర్న్ ఛాన ల్ మరమ్మతులు, సగం పనులకే పరిమితమైన మలిదేవి కాలువ ఆధునీకరణ పనులు పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ సమగ్ర నివేదికను మంత్రికి అందజేశారు.

అట్టల ఫ్యాక్టరీ వ్యర్థాల తొలగింపుతో గిరిజనుల హర్షం

- ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు



అట్టల ఫ్యాక్టరీ వ్యర్థాలను తరలిస్తున్న వాహనం

కావలి రూరల్, జూలై 14: కావలి పట్టణం ముసునూరు ఇందిరమ్మ కాలనీలోని అట్టల ఫ్యాక్టరీ వ్యర్థాల తొలగింపు శనివారం రాత్రి నుండి చేపట్టారు. ఏళ్ల తరబడి రోడ్డుపై నిల్వచేసిన వ్యర్థాలతో ఆ ప్రాంతం విషసర్పాలకు నిలయంగా మారింది. ఈ విషయాన్ని గిరిజనులు ఫ్యాక్టరీ యజమాని శిరీష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోక పోవడంతో గిరిజనులు ఆంధ్రజ్యోతిని ఆశ్రయించారు. దీంతో విషసర్పాలతో గిరిజనులకు ముప్పు అంటూ మే 16 నుండి వరుస కథనాలు ప్రచురించింది. దీనికి స్పందించిన నెల్లూరుకు చెందిన న్యాయవాది పాముల హరిప్రసాద్ గిరిజనుల సమస్యను ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 9వ తేదీన పొల్యూషన్ రీజనల్ అధికారి రాజశేఖర్ అట్టల ఫ్యాక్టరీ పరిసరాలు పరిశీలించి 15 రోజుల్లోగా వ్యర్థాలు తొలగించాలని ఫ్యాక్టరీ యజమానికి నోటీసులు జారీచేశారు. దీంతో వ్యర్థాల తొలగింపు పట్ల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తూ జాతీయ ఎస్టీ కమిషన్, ఆంధ్రజ్యోతితో పాటు న్యాయవాదికి, సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెన్‌కాక్ సిలాట్‌లో మితేష్ ప్రతిభ

- జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎన్నో పతకాలు
- జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సౌత్‌జోన్ పోటీల్లో పతకం అందుకుంటున్న మితేష్(ఫైల్)

నెల్లూరు (విద్య), జూలై 14 : క్రీడలపై ఉన్న మక్కువతో చిన్నతనం నుంచి సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తున్నాడు ఆర్కాట్ మితేష్. నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్ పేటకు చెందిన మితేష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతూనే మరోవైపు క్రీడల్లో కూడా సత్తా చాటుతున్నాడు. తనకు ఎంతో ఇష్టమైన పెన్‌కాక్ సిలాట్ క్రీడల్లో మెలకువలను నేర్చుకుని ఇటీవల జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

జిల్లా, రాష్ట్రస్థాయిలో పతకాలు

తొలుత జిల్లాస్థాయిలో పతకాలు సాధించి ఆటను మరింత మెరుగుపరుచుకునేందుకు ఒంగోలుకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారుడు పీ మనోజ్‌బాబు వద్ద శిక్షణ పొందారు. అనంతరం పుత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి నాసిక్‌లో జరిగిన సీనియర్ జాతీయస్థాయి పోటీల్లోనూ సత్తాచాటాడు. అలాగే కేరళలో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో బంగారుపతకం సాధించి జాతీయవర్సిటీ పోటీలకు ఎంపికై నాందేడ్‌లో జరిగిన పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. అనంతరం ఒరిస్సాలో జరిగిన యూనివర్సిటీ పోటీల్లో కాంస్యపతకం, మహారాష్ట్రలో జరిగిన ఫెడరేషన్ కప్‌లో కాంస్యపతకం సొంతం చేసుకున్నాడు.

ఇండోనేషియాలో శిక్షణ

అతడిలోని ప్రతిభకు మరింత పదును పెట్టేందుకు ఇండోనేషియాలో జరిగిన శిక్షణకు హాజరై అంతర్జాతీయ కోచ్ తితిహైయితి వద్ద శిక్షణ తీసుకున్నాడు. తాజాగా పాండిచ్చేరిలో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొని వెండిపతకం సాధించాడు. త్వరలో జరగనున్న జాతీయ ఇంటర్‌జోనల్ పోటీలకు ఎంపికై సాధన చేస్తున్నాడు. ఈ సందర్భంగా మితేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు కామాక్షి, చిట్టిబాబు అందించిన ప్రోత్సాహంతో రాష్ట్ర కార్యదర్శి భరద్వాజ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రసాద్‌ల సహకారంతో క్రీడల్లో రాణిస్తున్నానని తెలిపాడు. అందరి ఆంకాంక్షలకు అనుగుణంగా మున్ముందు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో జిల్లా కీర్తిని ఇనుమడింప చేసేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు.

గ్రామాల్లోకి వన్యప్రాణులు

● అటవీ ప్రాంతాల్లో నీటి కొరత ● దాహార్తితో జనావాసాల్లోకి పరుగులు
● కుక్కలబారిన పడి మృత్యువాత ● పట్టించుకోని అధికారులు


ఉదయగిరి బీసీ కాలనీలోకి వచ్చిన దుప్పిని రక్షించిన స్థానికులు (ఫైల్)

ఉదయగిరి, జూలై 14: స్థానిక రేంజ్ పరిధిలోని వన్యప్రాణులు గ్రామాల వైపు పరుగులు తీస్తున్నాయి. అటవీప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడి దాహార్తి తీర్చుకునేందుకు శివారు గ్రామాల్లోకి వస్తున్నాయి. వీటిని గమనించిన ఊరకుక్కలు వెంటపడడంతో కొన్ని తప్పించుకొని అడవుల్లోకి పారిపోతున్నాయి. మరికొన్ని వీటి బారినపడి గాయాలు పాలై మృత్యువాత పడుతున్నాయి. ఇంతజరుగుతున్నా అటవీశాఖాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తు న్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయగిరి రేంజ్‌పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాలున్నాయి. ఈ మండలాల పరిధిలోని అనేక గ్రామాల్లోకి నిత్యం ఏదో ఒకచోట పొడదుప్పులు, జింకలు, పందులు సంచరిస్తున్నాయి. ఆరునెలలుగా ఇవి జనవాసాల్లోకి పరుగులు తీస్తున్నాయి. ఉదయగిరి మండలం బిజ్జంపల్లి బీసీకాలనీ, ఉదయగిరి పట్టణంలోని షబ్బీర్‌కాలనీ, బీసీ కాలనీ, పూసల కాలనీ, దిలావర్‌బాయ్‌వీధి, దేవ లాలగడ్డ, ప్రభుత్వ వైద్యశాల, డిగ్రీ కళాశాల ప్రాంతాల్లోకి జింకలు, దుప్పులు చొరబడుతున్నాయి. కుక్కలబారిన పడిన వాటిని స్థానికులు రక్షించి అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉన్నతపాఠశాల క్రీడా మైదానం తదితర ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తులు నాటు బాంబులు పెట్టడంతో పందులు మృత్యువాతపడ్డ సంఘటనలు ఉన్నాయి. దాసరిపల్లి అటవీ ప్రాంతంలో కొందరు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసి వధించి గుట్టుచప్పుడు కాకుండా మాంసం విక్రయిస్తున్నారు. అలాగే విద్యుత్ కంచెలు తగిలి దాసరిపల్లి గ్రామానికి చెందిన పలువురివి లక్షలాది రూపాయల విలువ చేసే గేదెలు మృతిచెందిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు అడవుల్లో వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించి అడవి జంతువులను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి, జూలై 14: స్థానిక ఆర్టీసీ కార్యాయంలో మంగళవారం ఉదయం 11నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయగిరిప్రాంత ప్రయాణికులు సెల్:99592 25095 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియచేయాలన్నారు.

18 నుంచి సభ్యత్వాల నమోదు

ఉదయగిరి రూరల్, జూలై 14: ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు జనసేన పార్టీ నాలుగవ విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి అల్లూరి రవీంద్ర ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదిరోజుల పాటు కార్యక్రమంలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, వారి కుటుంబాలకు భరోసా కల్పించాలనే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.5లక్షల జీవితబీమా, రూ.50వేలు ప్రమాదబీమా లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పార్టీ కార్యకర్తలు, అభిమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఉదయగిరి, జూలై 14: మండలంలోని మిట్టపల్లి, కొట్టాలపల్లి గ్రామాల ఆరాధ్య దైవం పోలేరమ్మకు ఆదివారం భక్తులు పొంగళ్లు నిర్వహించారు. మహిళలు కొత్త బుట్టల్లో కాయాకర్పూరం, నైవేద్యం ఆలయ వద్దకు అమ్మవారికి పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఇరు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకపూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ పరిసరాల్లో నిర్వాహకులు భక్తులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు.

సోమశిలలో ప్రముఖులకు ఘన స్వాగతం


మంత్రులకు అక్షింతలు వేసి ఆశీర్వదిస్తున్న పండితులు

అనంతసాగరం, జూలై 14: సోమశిల డ్యాం సందర్శనకు ఆదివారం వచ్చిన రాష్ట్ర మంత్రులు ఆనం రామ నారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరావు, కాకర్ల సురేష్, పాశం సునీల్, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిలను కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం సోమేశ్వరుడి ఆలయం వద్దకు మంత్రులు చేరుకోగా వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలువురు నాయకులు సమస్యలతో కూడిన అర్జీలను వారికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షురాలు సునీత, మాకిరెడ్డి జనార్దన్‌రెడ్డి, శాకమూరి సుబ్బారావు, చల్లా శివారెడ్డి, చల్లా నర్సారెడ్డి, ఉప్పల విజయ్‌కుమార్, వేగు పెంచలయ్య, లక్ష్మిరెడ్డి, మనోజ్‌రెడ్డి, తిరుపతి నాయుడు, శాకమూరి వెంకటేశ్వర్లు, రాపూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

కలువాయి: సోమశిల జలాశయం పరిశీలనకు కలువాయి మీదుగా వెళుతున్న ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి నారాయణలను కలువాయిలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. సోమశిల, కండలేరు కాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు సోమశిల నీరు అందించాలని ఇరిగేషన్ మంత్రి రామానాయుడుకు విన్నతిపత్రం అందజేశారు. డీఎస్‌ఈ-98 ఎంటీఎస్ ఉపాధ్యాయుల జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వీసు క్రమబద్ధీకరణ, పింఛన్ మంజూరు, కౌన్సిలింగ్ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని మంత్రులకు ఉపాధ్యాయులు విన్నతిపత్రం ఇచ్చారు. వీరితో పాటు ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు టీ.నాగేశ్వరావు విన్నతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయడు, గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా రఘురామిరెడ్డి, చల్లా శ్రీనివాసులరెడ్డి, అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి, జగదల్ నాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు


మర్రిపాడు: పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు


ఉదయగిరి రూరల్: నాగులబావివీధిలో కొలువుదీరిన పీర్లు

ఉదయగిరి రూరల్, జూలై 14: మత సామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లిం సోదరులు జరుపుకునే మొహరం వేడుకలు (పీర్ల పండుగ) ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని నాగులబావివీధి పీర్లచావిడిలో పీర్లను ముస్తాబు చేసి నిలిపారు. విద్యుత్‌దీపాలతో అలంకరించారు. నాగులబావివీధి యూత్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే గుంత బజార్‌లో మేళతాళాలతో పీర్ల ఊరేగింపు చేపట్టారు. హిందూ, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

సీతారామపురం: మండలకేంద్రంలో పీర్ల చావిడ్లను విద్యుత్ దీప, పూల అలంకరణలతో ముస్తాబు చేశారు. కొట్టవీధి పీర్ల చావిడి వద్ద మౌలాలి స్వామి, సర్కార్ పీర్ల షరిగత్తు వేడుకలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో బాణాసంచా పేలుస్తూ వీధులలో పీర్ల ఊరేగింపు చేపట్టారు. పసుపులేటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పీర్లకు ప్రత్యేక పూ జలు చేసి అన్నదానం చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

సీతారామపురంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ అనూష పీర్లు ఊరేగింపు జరుగు ముఖ్యమైన మూడు ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. ఉత్సవ కమిటీలు నిబంధన ప్రకారం నడుచుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు.

మర్రిపాడు: మండల ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు ఏడురోజుల నుండి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏడోరోజు ఆదివారం మర్రిపాడు, పల్లవోలు, నందవరం, అల్లంపాడు, పిఎస్‌పల్లి గ్రామాల్లో మంగళ వాయిద్యాలతో పీర్లను వీధుల్లో ఊరేగించారు. కులాలమతాలకు అతీతంగా గ్రామస్థులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఇంటి ముందుకు వచ్చిన పీర్లకు మహిళలు హారతులు పట్టారు.

కలువాయి: మండలకేంద్రంలోని హసేన్ పీర్లను పిల్లలతో గుర్రాలపై ఊరేగించారు. కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో చండీయాగం

సంగం, జూలై 14: పెన్నానది సమీపంలో వెలసిన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు వేదపండితుల ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. అంతకుముందు మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి చందనాలంకారం ఏర్పాటు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు.

నిరుపేదలకు జనసేన చేయూత


సరుకులు అందచేస్తున్న నాయకులు

సంగం, జూలై 14: కోలగట్లలో ఇద్దరు నిరుపేద మహిళలకు జనసేన నాయకులు ఆదివారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. పూట గడవడమే కష్టంగా కాలం వెళ్లదీస్తున్న ఈ కుటుంబాలను గుర్తించి నెలకు సరిపడ బియ్యం, పప్పులు, నూనె, ఇతర సామగ్రిని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి శ్రీధర్, స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవీ విరమణ ప్రధానోపాధ్యాయుడికి సన్మానం


జాఫర్‌సాహెబ్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, జూలై 14: పదవీవిరమణ పొందిన గండిపాళెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం షేక్‌జాఫర్ సాహెబ్‌ను ఆదివారం స్థానిక షాదీమంజిల్‌లో ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, యూటీఎఫ్ మండల సభ్యులు సన్మానించారు. అంకితభావంతో పనిచేసి అవార్డులు పొందారని వక్తలు కొనియాడారు. ఎంఈవోలు మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు, షేక్ ఖాజామొహిద్దీన్, విశ్రాంత ఎంఈవోలు మోహన్‌రావు, నారాయణరావు, ఓబులరెడ్డి, అల్లాభక్షు, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఫణిరాజ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఆత్మకూరు, జూలై 14: ఆషాడమాసంలో వచ్చే గురుపౌర్ణమి సందర్భంగా గురుశిష్యుల సంబంధాలను తెలియజేస్తూ ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆదివారం అశ్వనీపురం, నువ్వూరుపాడు, జంగాలపల్లి, మహిమలూరు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను చదివి ఆత్మ, పరమాత్మ, జీవాత్మ అనే విషయాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్ర మంలో ప్రబోధ సేవా సమితి పొదలకూబరు కమిటీ అధ్యక్షులు పెంచలనరసయ్య, సభ్యులు పెంచల స్వామి, సుధాకర్‌ఆచారి, హరి, అభినయన, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు చెరువును పరిరక్షించాలి


తూములను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు, జూలై 14: శ్రీకృష్ణదేవరాయుల కాలం నాటి ఆత్మకూరు చెరువును పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా పరిరక్షించాల్సి అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలురైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్, గంటా లక్ష్మీపతి తెలిపారు. ఆదివారం రైతు సంఘం నాయకులతో కలిసి ఆత్మకూరు చెరువు తూములను పరిశీలించి మాట్లాడారు. చెరువు చివరి ఆయకట్టు వరకు సాగునీరు విడుదల చేసేందుకు తూములు పనికిరాకుండా ఉన్నాయని వాపోయారు. 3వేల ఎకరాలకు పైబడి ఉన్న సాగునీరు అందించే ఈ చెరువు కింద ఉన్న పంట కాలువలు అధ్వానంగా ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఒక తూము ద్వారా సాగునీరు సరఫరా అవసరం లేకుండా పోయిందన్నారు. రెండవ నెంబరు తూము ఆయకట్టు సగానికి సగం తగ్గిందని, 1600 ఎకరాలకు సాగునీరు అందిం చే మూడో నెంబరు తూము పంట కాలువలో ఏపుగా తుంగ, పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా ఉన్నా యన్నారు. మంత్రి ఆనం స్పందించి చెరువును పూర్తిస్థాయిలో రైతులకు ఉపయో గపడే తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

అంబేడ్కర్ సిద్ధాంతాలపై అధ్యయన తరగతులు

కలువాయి, జూలై 14 : స్థానిక ఏడీపీఎస్ కార్యాయలంలో ఆదివారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ సిద్ధాంతాలపై అధ్యయన తరగతులు నిర్వహించారు. ఏడీపీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిజమాల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడీపీఎస్ వ్యవస్థాపకులు ఇంగిలాల రామచంద్రరావు, ఏడీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కావ్య పర్యటన

అల్లూరు, జూలై 14: కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సోమవారం అల్లూరులో పర్యటించనున్నారని ఎంపీడీఓ జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూరల్, అర్బన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అన్ని శాఖల మండలాధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

సోమశిల నుంచి రాళ్లపాడుకు నీరందించాలి

● ఇరిగేషన్ మంత్రి నిమ్మలకు ఎమ్మెల్యే ఇంటూరి వినతి


మంత్రి రామానాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇంటూరి

కందుకూరు, జూలై 14: సోమశిల ప్రాజెక్టు నుంచి రాళ్లపాడు రిజర్వాయరుకు అందాల్సిన 1.5 టీఎంసీల నీరు ప్రతి ఏటా సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మంత్రి సోమశిల ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన సందర్భంగా అక్కడకు వెళ్లిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఈమేరకు నియోజకవర్గంలో సాగునీటి చెరువుల దుస్థితిని విన్నవించినట్లు తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గంలో ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న రాళ్లపాడు రిజర్వాయరుకు సోమశిల నుంచి రావాల్సిన నీరు రాకపోతుండటంతో కొన్నేళ్లుగా ఆయకట్టు రైతులు వరిసాగుకు దూరంగా ఉంటున్నారని, గత ప్రభుత్వంలో సోమశిల నుంచి సక్రమంగా నీరందలేదని ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఆ సమస్య రాకుండా సోమశిల నుంచి ఎలాంటి అడ్డంకులు లేకుండా రాళ్లపాడుకు అందాల్సిన 1.5 టీఎంసీలు అందేలా చూడటం ద్వారా ఆయకట్టులో వరిసాగుకు అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. అలాగే రాళ్లపాడు ఎడమకాలువ పొడిగింపు పనులు దశాబ్దాలుగా ముందుకుసాగటం లేదని, గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ రూ. 27 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించినా ఒక్కపైసా కూడా విడుదల కాలేదని మంత్రికి వివరించి తక్షణం ఎడమకాలువ పొడిగింపు పనులకు నిధులు విడుదలచేయాలని, చిన్ననీటి చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే ఇంటూరి తెలిపారు.

మంత్రి నిమ్మల దృష్టికి కావలి సాగునీటి సమస్యలు


మంత్రి నిమ్మలకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి

కావలి, జూలై 14: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని ఆదివారం నెల్లూరులో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. నెల్లూరు పర్యటనకు వచ్చిన మంత్రితో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొని కావలి నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్యలు పరిష్కారమవుతాయని రైతులు భావిస్తున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


భగవద్గీత ప్రచారంలో ప్రబోధ సేవాసమితి సభ్యులు

కొండాపురం, జూలై 14: గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీ కృష్ణభగవానుడేనని తెలియచేసే త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని సేవాసమితి సభ్యులు ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించారు. ఈనెల 21వ తేదీన గురుపౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు చేయాల్సిన పూజలపై ఇస్కదామెర్ల, పొట్టిపల్లి, వెలిగండ్ల గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు జి ప్రసాద్, సభ్యులు కె వెంకటేశ్వర్లు, జి పెంచలరత్నం, నరసింహులు, టి రమణయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కావలిటౌన్, జూలై 14: పట్టణంలోని జనతాపేటలోని విశ్వశాంతి హైస్కూల్ ఆవరణలో ఆదివారం డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ ఉచిత వైద్య శిబిరం జరిగింది. పాఠశాల కరస్పాడెంట్ రమణయ్య, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు నాయుడు వైద్య శిబిరం ప్రారంభించారు. విజయకుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వాకర్స్ 3కే రన్ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎన్ఎస్ యాదవ్

బిట్రగుంట, జూలై 14: బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆగస్టు 4వ తేదీన నిర్వహిస్తున్న 3కే రన్ పోటీల కరపత్రాలను ఆదివారం గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం స్వర్ణన్‌రాజ్ మాట్లాడుతూ పోటీలో పాల్గొనేవారు ఈ నెల 25వ తేదీలోపు 150 రూపాయలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ అధ్యక్షుడు కే శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు ప్రభాకర్, సత్యం, సుధాకర్, శ్యాంసుధాకర్ తదితరులు ఉన్నారు.

ఇమాంఖాసీంకు లంగర్ల ప్రదానం


లంగర్లు ప్రదానం చేస్తున్న ముస్లింలు

అల్లూరు, జూలై 14: మొహర్రం పర్వదినాలను పురస్కరించుకొని ఏడోరోజైన ఆదివారం అల్లూరు తూర్పు మహమ్మదీయ పాలెంలోని ఇమాంఖాసీంకు లంగర్లు ప్రదానం చేసే ఆచారాన్ని అనుసరించారు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత అగ్నిగుండం ప్రవేశ కార్యక్రమం చేపట్టిన ముస్లింలు వారి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా భక్తుల మొక్కుల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నుంచి లంగర్లు ఆచారాన్ని పాటించారు. అనంతరం రాత్రి ఇమాంఖాసీం పీర్లను గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు విశేషంగా పాల్గొని ఇమాంఖాసీం పీరును దర్శించుకొని ఫాతెహాలను నిర్వహించారు.

దళిత మహిళను హత్యచేసిన వారిని అరెస్టు చేయాలి

ఉలవపాడు, జూలై 14: కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాధహళ్లి గ్రామానికి చెందిన దళిత మహిళ బసివి గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి అతి కిరాతకంగా చంపిన దుండగులను వెంటనే అరెస్టు చేసి మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శులు ఎస్ నాగరాజు, ఆర్ మోహన్ సంయుక్త ప్రకటనలో కోరారు. గుండమ్మకు అండగా ఉన్న పురుషోత్తమరెడ్డిపై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి గుండమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అత్తలగుంట చెరువు ఆక్రమణలు తొలగించాలి


ఆక్రమణకు గురైన చెరువు భూములను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు

బిట్రగుంట, జూలై 14: అత్తలగుంట చెరువు ఆక్రమణలను తొలగించి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని నాగులవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి అధికారులను కోరారు. బోగోలు మండలం సుందరగిరివారి కండ్రిక పంచాయతీ భాస్కరగిరివారి కండ్రికకు చెందిన అత్తలగుంట చెరువును ఆదివారం రైతులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34.70 ఎకరాల అత్తలగుంట చెరువు 26 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా చెరువు ఆక్రమణలు జరిగాయని తెలిపారు. చెరువు ఆక్రమణలు తొలగించి చుట్టూ హద్దులు ఏర్పాటుచేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయనతో పాటు తిరుపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి, వెంకారెడ్డి బత్తుల తిరుపాల్ తదితరులు ఉన్నారు.

రోడ్డుకు అడ్డంగా వాహనాల పార్కింగ్

● అవస్థలు పడుతున్న ప్రజలు ● పట్టించుకోని పోలీసులు


రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలు

కావలి, జూలై 14: కావలి పట్టణ నడిబొడ్డున ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో రోడ్డుకు అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులకు గురవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అక్కడే ట్రాఫిక్ పోలీస్ పాయింట్ ఉన్నా రోడ్డుకు అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం రద్దీగా ఉండే మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆమార్గంలో రూ. 50లక్షలు ఖర్చుపెట్టి సీసీ రోడ్డు నిర్మించినా దానిని వాహనాల పార్కింగ్‌కు వాడుకుంటున్నందున ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పటం లేదు. రోడ్లు ఆక్రమించి వ్యాపారులు ముందుకు రావడం, కొనుగోలు కోసం వినియోగదారులు రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తీవ్రమవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయకుండా తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అక్కడ ఆటలాడితే ఆసుపత్రి పాలే..!

● కంకరతో నిండిన మినీ స్టేడియం


రాళ్లతో నిండివున్న మినీ స్టేడియం మైదానం

కావలిటౌన్, జూలై 14: కావలి పట్టణ మినీ స్టేడియంలో ఆటలాడితే ఆసుపత్రి పాలవ్వాల్సిందేనని స్థానిక క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2001లో కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులో మినీ స్టేడియం కోసం ప్రభుత్వం 9 ఎకరాలు స్థలం కేటాయించింది. అప్పటి నుంచి ఎలాంటి నిర్మాణాలు జరగనప్పటికీ పిల్లలు ఆడుకునేందుకు అనువుగా ఉండేందుకు మైదానం లెవలింగ్ పనులు చేశారు. మాగుంట పార్వతమ్మ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ. 10లక్షలతో మైదానం లెవలింగ్ పనులు చేపట్టగా, మట్టితో లెవలింగ్ చేయాల్సి వుండగా బొంతరాయితో లెవలింగ్ చేయడంతో ఆటలాడేందుకు అనువుగా లేక మైదానం నిరుపయోగంగా వుంది. పిల్లల క్రీడల సాధనకు, పోటీల నిర్వహణకు నోచుకోలేదు. 9ఎకరాల మైదానం మొత్తం రాళ్ళతో నిండివుండడంతో గాయాలపాలవ్వడం సాధారణ చర్యగా మారింది. స్టేడియం నిర్మాణం మాటేమోగాని మైదానంలోని కంకరను తొలగించి మట్టితో లెవలింగ్ చేస్తే పిల్లలు ఆడుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందని క్రీడాకారులు పేర్కొంటున్నారు.

సమస్యల వలయంలో ప్రశాంతికాలనీ

ఇళ్లముందే శ్మశానంతో ప్రజల ఇబ్బందులు


డ్రైన్‌లో నిలిచిపోయిన వర్షపునీరు

కందుకూరు, జూలై 14: కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతికాలనీ వాసులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పామూరు రోడ్డు చెంతనే ఉన్న ఈకాలనీ వద్ద వర్షపు నీరు వెళ్లేందుకు వీలుగా లక్షల రూపాయలు వెచ్చించి పెద్ద డ్రైనేజి నిర్మాణం చేసినప్పటికీ ఆనీరు ఎటు వెళ్లాలో మార్గం ఏర్పాటుచేయకుండా కాలువ నిర్మించి వదిలేయటంతో వర్షం వస్తే కాలనీవాసులకు తిప్పలు తప్పటం లేదు. డ్రైనేజీ కాలువ నిర్మించక ముందు ఈ సమస్య లేదని, కాలువ నిర్మించి వదిలేయటంతో కాలువ పొంగి కాలనీకి నీరు ముంచెత్తుతోందని, దీంతో దోమలు వృద్ధిచెంది వ్యాధులు ప్రబలుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. గతంలో పంట పొలాల గుండా వర్షపునీరు వెళ్లేదని అయితే ప్రస్తుతం చుట్టూ వెంచర్లు వేసిన భూయజమానులు వర్షం నీరు వెళ్లకుండా అడ్డం వేయటంతో సమస్యగా మారిందని, పామూరు రోడ్డుకి అభిముఖంగా కాలువ నిర్మించిన అధికారులు సబ్‌స్టేషన్ వరకు కచ్చా డ్రెయిన్ అయినా ఏర్పాటుచేస్తే నీరు సాఫీగా పోతుందని, అయితే కాలువ నిర్మించి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సమీపంలోని కల్లూరి కోటయ్య ఎస్టీ కాలనీకి మా ఇళ్లముందు మూడు సెంట్లు స్థలాన్ని శ్మశానంగా కేటాయించటంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని, రోడ్డు పక్కనే చాలీచాలని స్థలంలో శ్మశానం ఏర్పాటుచేయటం సమంజసం కాదని, వారికి అనువైన స్థలంలో శ్మశానం ఏర్పాటుకు అధికారులు తగు చర్యలు తీసు కోవాలని ప్రశాంతి కాలనీ వాసులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఆక్రమణకు గురైన రోడ్డుకు మోక్షం

● ఎన్నికల హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే ● పొలాల మధ్య రోడ్డు నిర్మాణంతో రైతుల్లో ఆనందం

సైదాపురం,జూలై 14: ఒకే పంచాయతీ పరిధిలోని రెండు గ్రామాల మధ్య ఉన్న బ్రిటీష్ కాలం నాటి దారి ఎన్నో సంవత్సరాలుగా ఆక్రమణలకు గురైంది. ఎన్నికల సమయంలో నాయకులు రావడం హామీలు ఇవ్వడం తప్ప దారి సదుపాయం కల్పించ లేకపోయారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఖచ్చితంగా రోడ్డు నిర్మాణం చేపట్టి ఎన్నికల హామీ నెరవేరుస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నెరవేర్చారని గ్రిద్దలూరు పంచాయతీ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పంచాయతీ పరిధిలోని ఆదూరుపల్లి గ్రామానికి గిద్దలూరుకు 3కి.మీ దూరం ఉంది. ఈ దారి ఆక్రమణలకు గురికావడంతో పంచాయతీ కార్యాలయానికి చేరుకోవాలంటే ఊటుకూరు గ్రామం నుంచి పొదలకూరు రోడ్డుకు చేరుకుని గ్రిద్దలూరు పంచాయతీ కార్యాలయంకు చేరుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆక్రమణలో ఉన్న దారిని గుర్తించారు. గ్రామ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వారి సొంత నిధులతో పొలాల్లో ఆక్రమణకు గురైన మట్టి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా సుమారు 1500 ఎకరాల పొలాలు ఉన్నాయి. పొలాల మధ్య రోడ్డు సదుపాయం లేక పోవడంతో రైతులు వరి పంట సాగు సమయంలో ఎరువులను పొలాలకు చేర్చాలంటే కూలీల సహాయంతో దూర ప్రాంతం మోయాల్సి వచ్చేది. సమస్య పరిష్కారం అవుతుండటంతో రెండు గ్రామాల మధ్య వాహన రాకపోకలు కొన సాగడమే కాకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాల రైతులకు కూడా అనుకూలమైన రోడ్డు ఏర్పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పొలాల మధ్య రోడ్డుపై మట్టి వేస్తున్న ఎక్స్‌కవేటర్

ఎమ్మెల్యే రామకృష్ణ రుణం తీర్చుకోలేనిది



బ్రిటీష్ కాలం నాటి రహ దారి ఆక్రమణలకు గురైంది. ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇవ్వడం తప్ప రోడ్డు నిర్మాణం చేపట్ట లేక పోయారు. పంచాయతీ కార్యాలయంకు చేరుకోవాలంటే పొదల కూరుకు వెళ్లి రావాల్సి వస్తుంది. ఎమ్మెల్యేగా గెలిపిస్తే తప్పకుండా ఆక్రమణలను తొలగించి రోడ్డు నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే రామకృష్ణ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. రైతులకు ఇచ్చిన హామీ రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఎమ్మెల్యేకు రైతులంతా రుణపడి ఉంటాం.

- పాములూరు శ్రీనివాసులు నాయుడు

మూడు మండలాలను కలిపే దారి



ఆదూరుపల్లి గ్రామం నుంచి గ్రిద్దలూరు గ్రామం మీదుగా మనుబోలు మండలం, వెంకటాచలం మండలాలను కలిపే పూర్వపు దారి ఆక్రమణలకు గురైంది. రైతులు పొలాలకు చేరుకునేందుకు రోడ్డు సదుపాయం కల్పించడం ఆనందంగా ఉంది.

- కొల్లూరు వెంకటేశ్వర్లు రెడ్డి,రైతు.

రైతుల కష్టాలు తీరుతున్నాయి



పొలాలకు ఎరువులు వేయాలంలో ఎరువుల బస్తాలు తీసుకుపో లేక కూలీలను పెట్టుకుని అధిక ఖర్చులు భరించే వాళ్లం. పొలాల మధ్య రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ఎమ్మెల్యే ఎన్నికల ఇచ్చిన హామీని నెరవేర్చడం ఆనందంగా ఉంది.


- ఇంతా వెంగళ్‌రెడ్డి

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

వైసీపీతో అంటకాగిందెవరు..?

● కార్పొరేషన్‌పై అధికార పార్టీ అన్వేషణ ● రూరల్లోనూ క్షేత్ర స్థాయిలో ఆరా ● రాజకీయ ముద్రలేని వారికోసం వెతుకులాట ● బదిలీలపై నెలకొన్న ఉత్కంఠ

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొలువుదీరింది. అన్నీ శాఖల్లోనూ అధికారులు, ఉద్యోగులను మార్చేందుకు అంతర్గత దస్త్రం సిద్ధమవుతోంది. మరో రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం సాధారణ బదిలీలకు అనుమతులు ఇవ్వనున్న నేపథ్యంలో అధికార పార్టీలో హడావుడి మొదలైంది. ఐదేళ్లపాటు వైసీపీతో అంటకాగిన అధికారులు, ఉద్యోగులు ఎవరు? అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ శ్రేణులను ఎలా ఇబ్బందులకు గురి చేశారు.? అన్న అన్వేషణ ప్రక్రియ నెల్లూరు కార్పొరేషన్‌లో జరుగుతోంది. గత ప్రభుత్వంలో చివరి ఏడాది కాలం పాటు రూరల్లో టీడీపీని లక్ష్యంగా చేసుకున్న యంత్రాంగాన్ని గుర్తిస్తున్న ఆ పార్టీ నేతలు జరగనున్న బదిలీల్లో ఎలాంటి రాజకీయ ముద్రలేని వారిని తెచ్చుకోవాలని వెతుకులాట మొదలుపెట్టారు. - నెల్లూరు(సిటీ)



నెల్లూరుకు మున్సిపల్ కమిషనర్ కొత్తవారిని తెచ్చుకోవడంతో పాటు అన్ని స్థాయిలలో బదిలీలు నిర్వహించేందుకు కార్పొరేషన్ పరిధిలో దస్త్రాలు సిద్ధం చేస్తున్నారు. నెల్లూరులోని మున్సిపల్ కార్పొరేషన్, అటు రూరల్లోనూ బదిలీలు జరగనుండగా ప్రస్తుతం కొనసాగుతున్న వారి పాత్రపై టీడీపీ వర్గాలు ఆరా తీస్తున్నాయి. నియోజకవర్గ, మండల, గ్రామీణ స్థాయిల్లో తాము ఎదుర్కొన్న ఇబ్బందులను నేతలకు వివరిస్తున్న శ్రేణులు వైసీపీతో అంటకాగిన వారి జాబితాలను ఇప్పటికే అందించారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా వ్యవహరించిన అధికారులు వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ఏజెంట్లుగా ఉంటూ టీడీపీ శ్రేణులను ఇబ్బందిపెట్టడమే ధ్యేయంగా పని చేశారంటూ చెప్పుకొస్తున్నారు. వారిని ఈ బదిలీల్లో కనుచూపుమేర లేకుండా దూరంగా ఉంచాలని కోరుతున్నారు. కార్పొరేషన్‌లో కొందరు ఈఈ, డీఈఈ, ఏఈఈలు ఆర్వో, ఆర్‌ఐలు, సిటీప్లానింగ్ అధికారులు, పారిశుధ్య విభాగంలోని అధికారులు వైసీపీతో అంటకాగుతూ టీడీపీ విజ్ఞప్తులు, ఫిర్యాదులను కనీసం పరిగణలోకి తీసుకోలేదన్న విమర్శలున్నాయి.

నెల్లూరు రూరల్లో...

గత ప్రభుత్వం చివరి ఏడాదిలో వైసీపీ నాయకత్వం మార్పు జరిగాక కొందరు అధికారులు విచ్చలవిడిగా వ్యవహరించారు. ఇందులో పోలీసులు వైసీపీకి ఏజెంట్లుగా పని చేశారన్న విమర్శలున్నాయి. ఇక రెవెన్యూలో తహసీల్దారు ఏకపక్ష నిర్ణయాలతో నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి పట్టాలు పంపిణీ చేశారన్న అపవాదు మూటకట్టుకున్నారు. కొందరు సచివాలయాల్లోని సిబ్బంది తాము అధికార యంత్రాంగంలో భాగస్వామ్యమన్న సంగతే మరచి వైసీపీకి కార్యకర్తలుగా పని చేశారు. ఇరిగేషన్‌లో కొందరు ఏఈలు వైసీపీ నాయకులతో కలిసి భూ ఆక్రమణల్లో పరోక్ష సహకారం అందించారు. వీరందరి వివరాలు సేకరిస్తున్న టీడీపీ నేతలు త్వరలో జరిగే బదిలీల్లో బయటకు పంపేందుకు దస్త్రం సిద్ధం చేసినట్లు సమాచారం. వారి స్థానంలో రాజకీయ ముద్రలేని వారిని తెచ్చుకోవాలన్న కసరత్తు జరుగుతోంది.

నేడు ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక

వెంకటాచలం, జూలై 14: మండలంలోని ఎర్రగుంట సమీపంలోని కమ్యూనిటీహాల్‌లో సోమవారం ఉదయం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అందిస్తున్న స్కూల్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరవుతున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీఐటీయూలో చేరిక

కోవూరు, జూలై 14: స్థానిక సీతా పోలయ్య భవనంలో ఆదివారం స్టోబీడీ కాలనీ భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ యూనియన్ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకుడు అల్లాడి గోపాల్ మాట్లాడుతూ కార్మికులు ఐక్యతను చాటాలని కోరారు. మండల నాయకుడు హరి మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కరించుకోగలమన్నారు. కార్యక్రమంలో ఎస్‌కె నజీర్, ఎస్‌కె చాంద్, ఎస్‌కె హుమాయున్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వండ్లూరులో పునరావాసం కల్పించాలని మంత్రికి వినతి

పొదలకూరు: తమకు కేటాయించిన పునరావాస స్థలాలను వెంటనే అందించాలని కండలేరు డ్యామ్ పరిశీలనకు విచ్చేసిన రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆదివారం కండలేరు ముంపు గ్రామం వండ్లూరు ప్రజలు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన దేవినేని వెంకటేశ్వర్లు, చంద్రమ నాయుడు, నువ్వుల శివకృష్ణ మాట్లాడారు. తాము 43 కుటుంబాలకు చెందిన వారమని 1996లో అప్పటి అధికారులు ఆదేశాల మేరకు గ్రామాన్ని వదిలి వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు పునరావాస స్థలం కేటాయించలేదని, తమకోసం పొదలకూరు - రాపూరు రహదారి, కండలేరు డ్యామ్ సెంటర్ సమీపంలోని కొత్త కంభాలపల్లికి వెళ్లే రహదారి వెంబడి కొంతస్థలం కేటాయించి మా కోసం ప్లాట్లు, రోడ్లు వేశారన్నారు. కానీ ఆ ప్లాట్లకు సంబంధించిన పట్టాలు అందజేయలేదన్నారు. తమకు పునరావాస స్థలాలు ఇప్పించి గ్రామానికి సంబంధించిన విద్యుత్, కమ్యూనిటీ హాలు, తాగునీరు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దారు కార్యాలయంలో పునరావాసానికి సంబంధించిన పత్రాలు సిద్ధంగా ఉన్నా అవి తమకు అందించడంలో జాప్యం జరుగుతోందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జూలై 14: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల మహాత్మా గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలు మాలలు, ఆశ్రమ స్థలదాత పొనక కనకమ్మ విగ్రహాలకు పట్టు వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యులుగా చేరండి

వెంకటాచలం, జూలై 14 : జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ నెల 18 నుండి 28వ తేది వరకు జరగనున్న జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు జనసేన ప్రారంభించిన రూ.5లక్షల జీవిత బీమా, రూ.50 వేల ప్రమాద బీమాతో కూడిన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

ఐదేళ్లు అభివృద్ధి గాలికొదిలేసి..
ఇపుడు ఊకదంపుడు ఉపన్యాసాలు

● ఇదీ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరిస్థితి
● జనసేన నాయకులు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు


మెగా వాటర్ ప్లాంట్ వద్ద జనసేన నాయకులు

పొదలకూరు, జూలై 14: మండలంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో మంత్రిగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి అభివృద్ధిని, పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేసి కక్ష్య సాధింపు చర్యలు చేపట్టారని సర్వేపల్లి జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆరోపించారు. ఆదివారం చిట్టేపల్లి తిప్ప వద్ద నున్న మెగా వాటర్‌ప్లాంట్‌ను, వాటర్ ట్యాంకర్‌లను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల ప్రజలకు రూ.2కే 20లీటర్ల నీరు అందించే మెగా వాటర్‌ప్లాంట్‌ను మూలన పెట్టిన మాజీ మంత్రి కాకాణిపై మండిపడ్డారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహ న్‌రెడ్డి ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో రూ.4.30కోట్లతో ప్రతి పేదవాడికి మినరల్ వాటర్ అందించాలని ఆలోచనతో మెగా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో సర్వేపల్లి శాసన సభ్యులుగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మెగా వాటర్ ప్లాంట్‌ను మూసివేసి తాగడానికి నీరు లేకుండా చేయడం బాధాకరం అన్నారు. ఐదేళ్లు అభివృద్ధి చేయని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీడియా సమావేశాలు పెట్టడం మానేసి, ఆయనేమి ఉద్ధరించారో దాని గురించి మాట్లాడితే బాగుంటుందన్నారు. సొంత మండలానికి గుక్కెడు మంచినీరు కూడా ఇవ్వలేని స్థితిలో కాకాణి పని చేశారన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణిభవానీనాయుడు, శ్రీహరి, పొదలకూరు మండల నాయకులు మధు, రఘురామయ్య, పెంచలయ్య, సంజు రాకేష్ పాల్గొన్నారు.

దేవాంగ సంక్షేమ సంఘ సమావేశం

ముత్తుకూరు, జూలై 14 : బలిజపాలెంలోని మహాలక్ష్మమ్మ గుడిలో ఆదివారం దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నెం సతీష్, అసోసియేషన్ అధ్యక్షులు సజ్జ వెంకటసురేష్ మాట్లాడారు. ప్రతి గ్రామంలోని దేవాంగ సోదరులందరూ ఐక్యత భావంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. కులవృత్తి, చేనేత పరిశ్రమలకు సరైన ప్రోత్సాహం లేనందున తమ పిల్లలను విద్య పట్ల ఆకర్షితం చేసి ఉన్నత ఉద్యోగాలు సాధించేలా తయారు చేయాలన్నారు. జిల్లా సంఘం చేసే పలు అభివృద్ధి కార్యక్రమాలు అంతిమయాత్ర పథకం, విద్యావికాసం, ప్రతిభా పురస్కారాలు, అవార్డుల గురించి కూలంకషంగా అందరికీ వివరించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మదిర వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య, మాధవయ్య, శ్రీనివాసులు, సుబ్బారావు, మునిశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జొన్నవాడ ఆలయంలో దేవదాయశాఖ డీసీ తనిఖీలు


ఆలయ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 14: జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయ కార్యాలయంలో దేవాదాయశాఖ గుంటూరు డీసీ కార్యాలయం డిప్యూటీ కమిషనర్ మహేష్‌రెడ్డి, సూపరింటెండెంట్, వి శ్రాంత ఉద్యోగి వెంకటేశ్వర్లు ఆదివారం తనిఖీలు చేపట్టి పలు రికార్డులు పరిశీలించారు. ఆలయంలో గత ఐదేళ్ళుగా జరిగిన అభివృద్ధి పనులు, విరాళాలు, జనరల్ ఫండ్, జమ, ఖర్చులకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. ఆలయ భూములు, అర్చకులు, కార్యాలయ, ఆలయ సిబ్బంది, శాశ్వత, ఔట్ సోర్సు ఉద్యోగులు, ఉద్యోగ, వంతుదారీ అర్చకులు, వెండి, బంగారు ఆభరణాలు లెక్కలకు సబంధించి రికార్డులు పరిశీలించారు. తనిఖీలపై డీసీ మహేష్‌రెడ్డి, ఏసీ జే శ్రీనివాసులును వివరణ కోరగా... సాధారణ తనిఖీలలో భాగమేనని తెలిపారు. తనిఖీలు పూర్తికాలేదని వివరాలు మళ్ళీ వెల్లడిస్తామని ఈఓ ఏవీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

పాఠాలకు దూరం.. పోషకాహారానికే పరిమితం

● ఇదీ అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి

పొదలకూరు, జూలై 14: గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు చిన్నారులకు నాణ్యమైన విద్యనందించాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్నా చిన్నారులను కేంద్రాలకు పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. కొందరు చిన్నారులను పంపినా పాఠాలు సరిగా బోధించక పోవడం, బాధ్యతగా పర్యవేక్షణ చేయకపోవడం వంటి కారణాలతో కేంద్రాలకు వచ్చే సంఖ్య అంతంత మాత్రంగా ఉంటోంది. మండలంలోని వెంకటాచలం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 91మెయిన్, 6 మినీ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటి పరిధిలో మూడు నుంచి ఆరేళ్ల వయసున్న చిన్నారులకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తున్నారు. వారి కోసం కేంద్రాలను సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్లేక్లాస్ తరహాలో ఆట వస్తువులను సమకూర్చారు.

● మరి విద్యాబోధన సంగతేంటి..

కేంద్రాల్లో చిన్నారులకు కనీస విద్యాబోధన లేకపోవడం ప్రధాన లోపంగా కనిపిస్తోంది. ఆంగ్ల మాధ్యమ పుస్తకాలు బోధించేలా కార్యకర్తలకు గతంలో శిక్షణ ఇచ్చినా క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సరుకుల పంపిణీలో అనేక మార్పులు చేయడంతో పాటు అనేక యాప్‌లను తీసుకొచ్చి సిబ్బందిపై పనిభారం పెంచారు. ఈ పరిస్థితుల్లో సిబ్బంది బోధన ప్రక్రియను పూర్తిగా విస్మరించారు. రికార్డుల నిర్వహణ పేరుతో ప్రతినెలా చివరలో సిబ్బంది అంతా కేంద్రాలకు దూరం ఉండడం, సాధారణ రోజుల్లోనూ సమయానికి కేంద్రాలు తెరవకపోవడంతో చిన్నారులను కేంద్రాలకు పంపడం లేదు. పట్టణాల్లో ప్లే స్కూళ్లకు పంపిస్తుండగా గ్రామాల్లో ఇళ్ల వద్దే ఉంచుకుని ఉన్నంతలో వారే విద్యాబుద్ధులు నేర్పుతున్నారు.

● అవగాహన కల్పించినా ఫలితమేదీ?

కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచాలన్న సంకల్పంతో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ సౌకర్యాలు, సేవల గురించి వివరించారు. చక్కటి విద్యాబుద్ధులు నేర్పిస్తామని చిన్నారులను కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులు కోరారు. గతంలోనూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించినా పెద్దగా ఫలితం కనిపించలేదు. తాజాగా నిర్వహించిన కార్యక్రమం సైతం ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. చివరకు కొన్నిచోట్ల ఈ కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించి చేతులు దులుపుకొన్నారు.


అంబేడ్కర్ సంక్షేమ భవన సముదాయం


ప్రాంగణంలో పాడైన బంకులు, నెట్టుడుబండ్లు

అంబేడ్కర్ సంక్షేమ భవనం ఎవరికీ పట్టదా?

● మృతదేహాలు.. కర్మక్రతువులూ అక్కడే ! ● చెత్తాచెదారాలతో డంపింగ్ యార్డులా ప్రాంగణం ● పట్టించుకోని అధికారులు


భవన్ ప్రాంగణంలో ఉంచిన మృతదేహం (ఫైల్)

నెల్లూరు(హరనాథపురం), జూలై 14 : నగర నడ్డిబొడ్డున సుబాదారుపేటలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ భవనం పరిరక్షణ ఎవరికీ పట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతోన్నాయి. దీంతో ఆ చుట్టపక్కల నివాసితులు కొందరు ఎవరైనా మృతిచెందితే ఆ మృతదేహాలను అంబేడ్కర్ సంక్షేమ భవనం ప్రాంగణంలో ఉంచడంతోపాటు అక్కడే కర్మక్రతువుల వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన ఈ సంక్షేమ భవనం పాడుబడిన భవంతి వలె మారింది. దీని గురించి పట్టించుకొనే వారే కరువయ్యారు. ఆ భవనాన్ని, భవన ప్రాంగణాన్ని ఆ చుట్టపక్కల వారు ఒక డంపింగ్ యార్డులా వినియోగిస్తున్నారు. రాత్రి పూట అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు సమచారం. గతంలో ఒక్కడ ఎస్సీ కార్పొరేషన్, సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ కార్పొరేషన్, ద్వామా, మెప్మా కార్యాలయాలు ఉండేవి. నిత్యం అధికారులు, వివిధ పనులపై వచ్చే ప్రజలు, లబ్ధిదారులతో కలకలలాడేది. అయితే భవనం పాడుబడడంతో తొలుత ద్వామా కార్యాలయాన్ని అక్కడి నుంచి మార్చేశారు. ఆ తరువాత ఇటీవల ఎస్సీ కార్పొరేషన్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయాలను ఇక్కడి నుంచి మరో చోటుకి మార్చారు. ప్రస్తుతం అక్కడ బీసీ కార్పొరేషన్, మెప్మా కార్యాలయాలు ఉన్నాయి. అయితే ఈ కార్యాలయాల ప్రాంగణంలో జరుగుతున్న అసాంఘికాలను అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు లేకపోలేదు. శనివారం ఆ కార్యాలయం ప్రాంగణంలో ఓ మృతదేహాన్ని ఉంచి కార్యక్రమాలు నిర్వహించారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. దీనిని బట్టి అధికారుల నిర్లక్ష్యం ఎలా ఉందో అర్థమవుతోంది. ఇదిలా ఉండగా ఆ కార్యాలయంలో చెత్తపేరుకొని ఉంది. ఈ చెత్త వాసనను పీలుస్తూ ఆ కార్యాలయాలకు వెళ్లా లంటేనే భరించలేని పరిస్థితి నెలకొని ఉంది. చెత్తతో పాటు పాడైపోయిన నెట్టుడు బండ్లు, ఇతర చెత్త వస్తువులు సంక్షేమ భవనం ప్రాంగణలో వేస్తుండడంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. వీటి విషయం పట్టించుకోవటం అధికారులు మానేశారు. ఇలానే వదిలేస్తే అక్కడ ఇకపై ఎలాంటి కార్యక్రమాలైన చేసేస్తారు. ఇప్పటికైనా ఇక్కడ జరిగే అసాంఘికాను నియంత్రించాలని, ఖాళీ స్థలం ఎక్కువగా ఉన్నందున ఇక్కడే ఎస్సీ కార్పొరేషన్‌కు నూతన భవంతిని నిర్మించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు తగదు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి


మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

నెల్లూరు(క్రైం): జూలై 14: నగరంలో టిప్పు సుల్తాన్ విగ్రయం ఏర్పాటు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, దీనిని భారతీయ జనతా పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందువుల పట్ల అతి క్రూరంగా వ్యవహరించిన టిప్పు సుల్తాన్ లాంటి వ్యక్తి స్వతంత్ర సమరయోధుడు అని, గొప్పవ్యక్తి అని కొందరు చెప్పడం అత్యంత బాధాకరమన్నారు. ఈ నాటికి ఆయన దురాగతాలకు నిదర్శనంగా దేశంలో ఒక ప్రాంతంలో దీపావళి పండుగ హిందువులు జరుపుకోరని, అందుకు కారణం టిప్పుసుల్తాన్ జన్మదిన వేడుకలకు మతం మారని హిందువులను ఊచకోత కోయడమేనన్నారు. బీజేపీ ఎప్పుడూ ముస్లింలను గౌరవిస్తుందని, దేశం కోసం త్యాగం చేసిన ఆజాద్, అబ్దుల్ కలాం లాంటి దేశభక్తుల విగ్రహాలు నెల్లూరులో ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామని, టిప్పు సుల్తాన్ లాంటి హిందూ ద్రోహుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామంటే ఒప్పుకునే ప్రశ్న లేదన్నారు. నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ మాట్లాడుతూ నగరంలో ఇటీవల టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కమ్యూనిస్టు ముసుగులో ప్రయత్నం చేస్తున్నా రన్నారు. ప్రశాంతంగా ఉన్న నగరంలో కొందరు మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయం చేయా లని చూస్తున్నారని, పోలీసు యంత్రాంగం గమనించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశం లో బీజేపీ ప్రధాన కార్యదర్శులు గడ్డం విజయకుమార్, యరబోలు రేజేష్, యశ్వంత్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కందమూరులో జనసేన జెండా ఆవిష్కరణ

నెల్లూరురూరల్, జూలై 14 : నెల్లూరు రూరల్ మండలంలోని కందమూరులో ఆదివారం జనసేన నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుణుకల కిషోర్ మాట్లాడుతూ నెల్లూరు రూరల్లోని అన్ని గ్రామాల్లో జనసేన పార్టీ జెండా ఆవిష్కరిస్తామని తెలిపారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ పార్టీ శ్రేణులు నిర్వహించిన పోరాటాలు అభినందనీయమన్నారు. పార్టీ ప్రతికూల పరిస్థితుల్లో పార్టీ పటిష్టత కోసం నిలబడిన జనసైనికులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఏ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, మస్తాన్, రాము, సుధాయాదవ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


కందమూరులో జెండా ఆవిష్కరిస్తున్న జనసేన పార్టీ నాయకులు

నేడు రంగనాథుడికి బంగారు గరుడసేవ

నెల్లూరు(సాంస్కృతికం) జూలై 14 : నెల్లూరు నగరంలో వేంచేసి ఉన్న తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో సోమవారం అని నెల స్వాతి నక్షత్రం రోజున పెరియాల్వార్ జన్మనక్షత్రం సందర్భంగా ఉదయం 9 గం టలకు శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామికి పెరియాల్వార్లకు తిరుమంజనం జరుగుతాయని ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచిగంటి శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4.30గంటలకు రంగనాథుడికి బంగారు గరుడసేవ, పెరియాల్వార్లకు గజవాహనసేవ, పేట ఉత్సవం జరుగుతుందని, భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

వర్షం వస్తే రహదారులు జలమయం!

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 14 : వర్షం వస్తే నగరంలో రోడ్లు జలమయం అవుతోన్నాయి. రోడ్లపై నీటి తటాకాలు, భారీ గుంతలతో నిల్వచేరిన నీటితో ప్రమాదాలు పొంచిఉండడంతో ప్రజలు, వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. డ్రైనేజీలు ఆక్రమణ, దుకాణాలు, ఇళ్ల ముందు ఎత్తైన ర్యాంపులు, వాన నీరు వెళ్లే మార్గాలు లేక నీరు నిస్తోంది. మరీ ముఖ్యంగా పొదలకూరు రోడ్డులోని రామకోటినగర్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు సారాయిఅంగడి సెంటర్, పద్మావతి సెంటర్, జడ్పీ హైస్కూల్, తెలుగుగంగ కాలనీ తదితర ప్రాంతాలతోపాటు అయ్యప్పగుడి దగ్గర నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు వేదాయపాలెం సెంటర్, నిప్పో సెంటర్, కరెంటు ఆఫీస్, రాజరాజేశ్వరమ్మ గుడి, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాలలో, మినీబైపాస్‌లోని కొన్ని చోట్ల ప్రధాన రహదారులపై ఎక్కడపడితే అక్కడ భారీ గోతులతో పాటు డ్రైనేజీ కోసం ఏర్పాటు చేసిన హోల్స్ మనుషుల ప్రాణాలు మింగేసేలా మారిపోయాయి. కాగా కరెంటు ఆఫీసు సెంటర్‌లో డ్రైనేజీ ఆక్రమణ చేసి నిర్మాణాలు చేసిన పెట్రోలు బంక్, ఇతర సముదాయాలు వలన చిన్నపాటి వర్షానికి రోడ్డుపైనే నీరు చెరువును తలపిస్తోంది. నీటిలో గోతులు కనిపించక వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు.


కరెంటు ఆఫీసు సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

సోమవారం 15 జూలై 2024





'కొండ'ంత

వివాదం!

ఇప్పటికే రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు

ఒకరి మెప్పుకోసం ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ధర్మారెడ్డి

ఐదేళ్లూ ఆయనపై విమర్శలు, ఆరోపణలు

అందరి దృష్టీ విచారణ పర్యవసానాలపైనే!

ప్రభుత్వం మారాక ఫిర్యాదుల వెల్లువ

ఒకరి మెప్పుకోసం ఆయన 'కొండ'ంత వివాదాస్పదుడిగా మారారు. టీటీడీలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆయన నిర్ణయాలు, చర్యలు ఏ ఒక్కరి నుంచీ ప్రశంసలను పొందకపోగా అన్నివర్గాల విమర్శలకు, ఆరోపణలకు గురయ్యాయి. టీటీడీలో మూడు పర్యాయాలు కీలకంగా పనిచేసిన ఆయన ప్రతిసారీ వివాదాస్పద పరిస్థితుల్లో, అవమానకరంగా నిష్క్రమించారు. ఆ అధికారే టీటీడీ మాజీ ఈవో ఏవీ ధర్మారెడ్డి. కూటమి అధికారంలోకి వచ్చాక ఆయన నిర్ణయాలు, చర్యలపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. ఇందులో ఏవి వెలుగు చూస్తాయి? ఆయనపై ఎలాంటి చర్యలుంటాయన్న చర్చ అన్ని వర్గాల్లో నడుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కేంద్ర రక్షణ శాఖలో ఐడీఈఎస్ అధికారైన ఏవీ ధర్మారెడ్డి టీటీడీలో మూడుసార్లు డిప్యుటేషన్‌పై పనిచేశారు. ప్రతిసారీ ఆయన పనితీరు వివాదాస్పదమే. తొలిసారి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసి 2004 జూలై 5న ధర్మారెడ్డిని టీటీడీలో తిరుమల జేఈవో పోస్టులో ఓఎస్‌డీగా నియమించారు. రెండేళ్లపాటు ఆ పోస్టులో ధర్మారెడ్డి కొనసాగారు. అప్పటి పాలకమండలి ఛైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకర్‌రెడ్డి కంటే ముందుగానే సభ్యురాలిగా టి.సుబ్బరామిరెడ్డి సతీమణి ఇందిరతో ప్రమాణస్వీకారం చేయించడం వివాదంగా మారింది. దీన్ని అవమానంగా భావించిన కరుణాకర్‌రెడ్డి.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వద్ద పట్టుబట్టి ధర్మారెడ్డిని బదిలీ చేయించారు. భూమన పదవీకాలం ముగిశాక 2008 ఏప్రిల్ 2న మరోసారి ధర్మారెడ్డి టీటీడీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. తిరుమల జేఈవో పోస్టులో ఓఎస్‌డీగా నియమితులై 28 నెలల పాటు పనిచేశారు. ఈయన వద్ద క్యాంపు క్లర్క్‌గా పనిచేస్తున్న సురేష్ ఆత్మహత్య చేసుకోవడంతో ధర్మారెడ్డి వేధింపులే కారణమని మృతుడి కుటుంబీకులు, ఉద్యోగ సంఘాలు అప్పట్లో ఆందోళనకు దిగాయి. దీంతో 2010 ఆగస్టు 31న ప్రభుత్వం మరోసారి ఆయనపై బదిలీ వేటు వేసింది. వైఎస్ జగన్ సీఎం కాగానే 2019 జూలై 12న మూడోసారి ధర్మారెడ్డి డిప్యుటేషన్‌పై టీటీడీలో స్పెషలాఫీసర్‌గా తిరుమల జేఈవో పోస్టులో నియమితులయ్యారు. ఈసారి ప్రభుత్వం ఆయన కోసం జేఈవో పోస్టును అదనపు ఈవోగా స్థాయి పెంచింది. 2022 నవంబరులో ఈవో జవహర్‌రెడ్డి బదిలీ కావడంతో ఈవో పోస్టును కూడా ధర్మారెడ్డికే కట్టబెట్టింది. దీంతో టీటీడీలో ఆయన సర్వాధికారిగా మారారు.

ఇప్పుడూ అవమానకర నిష్క్రమణే

మూడోసారి నియమితులైన ధర్మారెడ్డి ఐదేళ్లపాటు టీటీడీలో ఎదురులేని వ్యక్తిగా అధికారం చెలాయించారు. అధికార పార్టీ నేతలనూ లెక్కచేయలేదు. ప్రభుత్వం మారడంతో సెలవు పెట్టి వెళ్లిపోయేందుకు యత్నించారు. ఆయనపై తీవ్ర ఆగ్రహంగా ఉన్న కొత్త ప్రభుత్వం సెలవు పెట్టడానికి అంగీకరించలేదు. సీఎం చంద్రబాబు తిరుమలకు వచ్చే క్రమంలో ధర్మారెడ్డి ముఖం చూడడం కూడా ఇష్టపడక పోవడంతో అప్పటికప్పుడు వారం పాటు సెలవుపై పంపించింది ప్రభుత్వం. తర్వాత ఆయనే సెలవు పొడిగించుకుని గత నెలాఖరున సెలవులో ఉండగానే సర్వీసు నుంచి రిటైరయ్యారు. కనీసం అధికారికంగా టీటీడీ యంత్రాంగం వీడ్కోలు పలికే పరిస్థితి కూడా లేదు. గతంలో రెండుసార్లు అవమానకర రీతిలో బదిలీ అయిన ఆయన.. మూడోసారి మాత్రం అనామకంగా, అవమానకరంగా కొండ దిగాల్సి వచ్చింది.

ఐదేళ్లూ ఆరోపణలు.. ఇపుడు ఫిర్యాదులు

టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చిన ధర్మారెడ్డి తీరుపై వైసీపీ మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీల నేతలూ మండిపడ్డాయి. ప్రతిపక్ష నేత హోదాలో టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ జిల్లాలోనూ, వెలుపలా కూడా అనేక సందర్భాల్లో ధర్మారెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు. అప్పటి టీటీడీ వ్యవహారాలపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి సంబంధించి కేంద్ర మంత్రులూ ధర్మారెడ్డి తీరుపై ఫిర్యాదులు చేశారు. స్థానిక నేతలైతే ఆందోళనలకు దిగిన సందర్భాలూ ఉన్నాయి. అనేక అంశాలపై కోర్టుల్లోనూ పోరాడారు. చివరికి కమ్యూనిస్టు నేత నారాయణ వంటి వారూ ధర్మారెడ్డి నిర్ణయాలను ఆక్షేపించినవారే. కూటమి అధికారంలోకి రావడంతో ఇప్పుడు నేరుగా ప్రభుత్వానికే ఫిర్యాదులు చేస్తున్నారు. కొందరు సీఎం చంద్రబాబుకు, మరికొందరు సీఎస్‌కు, ఇంకొందరు డీజీపీకి, సీఐడీ చీఫ్‌కు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి, ఏసీబీకి సైతం ఫిర్యాదులు చేస్తున్నారు. ఒకరిద్దరు తమ ఫిర్యాదులకు ఆధారాలూ జతచేశారు.

ధర్మారెడ్డి హయాంలో మసకబారిన టీటీడీ ప్రతిష్ఠ

టీటీడీ చరిత్రలో ఏ అధికారీ చేయని రీతిలో ధర్మారెడ్డి అధికారం చెలాయించారు. నిరంకుశుడనే పేరు తెచ్చుకున్నారు. అప్పట్లో సీఎం జగన్‌కు సన్నిహితుడనే కారణంగా అధికార పార్టీలోనూ అతికొద్ది మంది ముఖ్య నేతలను మినహా మిగిలిన వారిని ఖాతరు చేయలేదు. మంత్రులు సైతం ఆయన నుంచి అవమానాలు ఎదుర్కొన్నవారే. దర్శనాల విషయంలోనూ అతి కొద్దిమందికే పెద్దపీట వేశారు. జగన్‌పై ఉన్న అక్రమాస్తుల కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను, న్యాయమూర్తులను ప్రభావితం చేసేందుకు టీటీడీని, శ్రీవారి దర్శనాలను దుర్వినియోగం చేశారన్నది ఆయనపై ఉన్న ప్రధాన ఆరోపణ. ఓ హైకోర్టు న్యాయమూర్తికి ఖరీదైన వాచీ ఇవ్వజూపారని, మరెందరో న్యాయమూర్తులు తమకు తామే ఎబ్బెట్టుగా భావించేలా తిరుమలలో అతి మర్యాదలు చేయబోయారన్న ఆరోపణలూ ఉన్నాయి. మరోవైపు వైసీపీ ముఖ్యులకు, పాలకమండలి ముఖ్యులకు లబ్ధి కలిగించేలా నిధుల కేటాయింపులు జరిపి ఆర్థిక పరమైన తప్పిదాలకు పాల్పడ్డారనే ఆరోపణలు టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. దర్శన టికెట్ల కేటాయింపు, శ్రీవాణి ట్రస్టుద్వారా విరాళాల మళ్లింపు, ఇంజనీరింగ్ పనులకు అవసరం లేకున్నా రూ.వేల కోట్ల కేటాయింపు వంటివి ఆయనపై ఉన్న ఇతర ఆరోపణలు. వీటికితోడు మితిమీరిన అహంకారం, వ్యక్తిగత ప్రతిష్ఠకు పోవడం, ఎదుటి వారిని ఇబ్బంది పెట్టేలా కఠినంగా వ్యవహరించే నైజమని ఆయన్ను దగ్గర్నుంచి గమనించిన టీటీడీ వర్గాలు చెబుతుంటాయి.

విచారణ కొనసాగిస్తున్న విజిలెన్స్

టీటీడీ వ్యవహారాలపై ఇప్పటికే ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ విభాగం అధికారులు బృందాలుగా ఏర్పడి ఆయా విభాగాల్లో తనిఖీలు, విచారణలు కొనసాగిస్తున్నారు. వెలుపల అవగాహన కలిగిన వ్యక్తులను కలిసి సమాచారం సేకరిస్తున్నారు. వీటిని క్రోడీకరించుకునే పని వేగంగా జరుగుతోంది. సాధ్యమైనంత త్వరలో ధర్మారెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దానికి అవసరమైన ఆధారాల కోసం విజిలెన్స్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. విజిలెన్స్ దర్యాప్తులో తేలే అంశాలు.. వాటి ఆధారంగా ధర్మారెడ్డిపై తీసుకునే చర్యలపైనే ఇప్పుడు రాజకీయ, టీటీడీ వర్గాలతోపాటు సామాన్య జనం దృష్టి కూడా ఉంది. ధర్మారెడ్డికి వైసీపీ అధినేత జగన్ వద్ద ఉన్న అపరిమిత పలుకుబడి కారణంగా ఇప్పుడు ఆయన్ను ఇబ్బంది పెడితే భవిష్యత్తులో తమకూ సమస్యలు ఎదురవుతాయన్న ఆందోళన విజిలెన్స్ అధికారుల్లో నెలకొన్నదని, అందుకే విచారణను సాగదీస్తున్నారనే ప్రచారం ఇప్పటికే మొదలైంది. అయితే టీటీడీ నిర్వహణలో జరిగిన ఆర్థిక తప్పిదాలను గుర్తించి.. ధర్మారెడ్డి తదితరులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం ఉందన్న ప్రచారం మరోవైపు సాగుతోంది. నిజంగానే ప్రభుత్వం ధర్మారెడ్డిపై కఠిన వైఖరి తీసుకుంటుందా లేక తప్పిదాలను ఎత్తిచూపడం వరకే పరిమితం అవుతుందా అన్నది వివిధ వర్గాలను, ప్రజల్ని ఉత్కంఠకు గురి చేస్తోంది. ఇందులో ఏదైనా నెల రోజుల్లోపే జరుగుతుందని అధికార వర్గాల సమాచారం.

ఎస్పీగా సుబ్బరాయుడు నేడు బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), జూలై 14: జిల్లా ఎస్పీగా ఎల్.సుబ్బరాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే టీటీడీ ఇన్‌చార్జి సీవీఎస్వోగా ఆయన్ను నియమించే అవకాశాలున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

విద్యుత్ బస్సుల చార్జింగ్ స్టేషన్‌కు

తిరుమలలో స్థలం ఎంపిక

- పరిశీలించి, సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ ఎండీ
- టీటీడీకి ప్రతిపాదనలు పంపాలని ఆదేశం



బాలాజీనగర్ వద్ద శనివారం సాయంత్రం స్థలాన్ని పరిశీలిస్తున్న ద్వారకా తిరుమలరావు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 14: తిరుమల-తిరుపతి మధ్య పూర్తిస్థాయిలో విద్యుత్ (ఎలక్ట్రిక్) బస్సులు నడపాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయి. రెండేళ్ల కిందట జిల్లాకు తొలివిడతగా వంద విద్యుత్ బస్సులు వచ్చాయి. అందులో 62 బస్సులు.. తిరుమల-తిరుపతి, రేణిగుంట మధ్య, మిగిలినవి తిరుపతి కేంద్రంగా కడప, మదనపల్లె, నెల్లూరు, శ్రీకాళహస్తిలకు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటికోసం అలిపిరి డిపో, సీబీఎస్‌లో చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. అయితే పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమల - తిరుపతి మధ్య సుమారు 250 బస్సులు నడపాలన్నది ఇటు ప్రభుత్వం, అటు టీటీడీ లక్ష్యంగా ఉంది. ఇన్ని బస్సులు నడపాలంటే ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్ (వంద బస్సులు ఒకేసారి చార్జింగ్ చేసుకునేలా)ను ఏర్పాటు చేయాలని భావించారు. దీన్ని తిరుమలలో ప్రస్తుతమున్న బస్టాండు, గ్యారేజీలో ఏర్పాటుకు వీలుపడదని నిపుణుల ద్వారా ఆర్టీసీ అధికారులు నిర్ధారించుకున్నారు. ఆ తర్వాత టీటీడీని సంప్రదించి స్థలం కేటాయించాలని కోరారు. కొన్ని ప్రాంతాలను పరిశీలించి.. బాలాజీనగర్‌కు వెళ్లేమార్గంలో గ్యాస్ గోడౌన్ వద్ద నాలుగు ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసుకున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు డీజీపీ హోదాలో తొలిసారిగా తిరుమల పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా ఏడాదిన్నరగా వాయిదా పడుతున్న ఈ అంశం ఓ కొలిక్కివచ్చింది. శనివారం సాయంత్రం బాలాజీనగర్ వద్ద స్థలాన్ని ఆయన పరిశీలించారు. చార్జింగ్ స్టేషన్‌కు అనుకూల, ప్రతికూల అంశాలపై డీపీటీవో చెంగల్‌రెడ్డి, డీఎం విశ్వనాథం, ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. స్థల ఎంపికపై ఎండీ సానుకూలంగా స్పందించారు. ఆలస్యం చేయకుండా ఆర్టీసీ తరపున టీటీడీకి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కాగా, తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ బస్సు టర్మినల్ నిర్మాణ సమయంలో ఇక్కడి డిపోను చంద్రగిరికి తరలించే యోచనలో ఉన్నామని అధికారులు తెలిపారు. అందువల్ల చంద్రగిరి బస్టాండు విస్తరణకు అవసరమైన ప్రతిపాదనలకు కూడా ఎండీ అంగీకరించినట్లు తెలిసింది.



ప్రమాదానికి కారణమైన లారీ

విషాదం

- ఆటో కోసం నిరీక్షిస్తుండగా తల్లీ బిడ్డలపైకి దూసుకొచ్చిన లారీ
- తల్లి, రెండేళ్ల కుమార్తె దుర్మరణం
- కుమారుడి పరిస్థితి విషమం





వైష్ణవి, శారద (ఫైల్ ఫొటోలు)

ఏర్పేడు, జూలై 14: రోడ్డు పక్కన ఆటో కోసం నిరీక్షిస్తున్న తల్లీబిడ్డలపైకి ఓ లారీ దూసుకొచ్చింది. ఈ దుర్ఘటనలో తల్లి, రెండేళ్ల కుమార్తె దుర్మరణం చెందారు. కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషాద సంఘటన ఏర్పేడు మండలం అముడూరు క్రాస్ వద్ద ఆదివారం రాత్రి ఏడు గంటలకు జరిగింది. ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి మండలం రామానుజపల్లె గ్రామానికి చెందిన బాపన శివకుమార్ భార్య శారద(22) తన కుమారుడు కార్తీక్(4), కుమార్తె వైష్ణవి(2)ని తీసుకుని ఈనెల 13వ తేదీన తన పుట్టిల్లు అయిన రేణిగుంట మండలం మల్లవరానికి వెళ్లింది. తిరిగి ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు రామానుజపల్లె వెళ్లడానికి ఇద్దరు బిడ్డలతోపాటు తల్లి విజయమ్మ(50)ను తీసుకుని వెంకటగిరి బస్సు ఎక్కింది. 6.45గంటల సమయంలో అముడూరు క్రాస్ వద్ద బస్సు నుంచి దిగారు. అక్కడినుంచి రామానుజపల్లెకి వెళ్లడానికి ఆటో కోసం నలుగురూ రోడ్డు పక్కన నిరీక్షిస్తున్నారు. ఇంతలో మృత్యుశకటంలా ఓ లారీ వీరిపైకి దూసుకొచ్చింది. ఈ దుర్ఘటనలో శారద అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రికి తరలిస్తుండగా వైష్ణవి మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ కార్తీక్‌ని టోల్‌ప్లాజా అంబులెన్సులో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సూచనలతో రేణిగుంట మండలంలోని అమరా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, ఈ ప్రమాదంలో శారద తల్లి విజయమ్మకు ఎలాంటి గాయాలు కాలేదు. ఏర్పేడు సీఐ కేసు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వీడ్కోలు

రేణిగుంట, జూలై 14: తిరుమల పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు ఆదివారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయంలో కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, టీటీడీ జేఈవో గౌతమి, నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ వీడ్కోలు పలికారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ దంపతులు వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు.



సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు శ్రీవారి ప్రతిమ అందజేస్తున్న కలెక్టర్ దంపతులు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 14: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 33వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,808 మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 4,298 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 3,243 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,344, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 376మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 289మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 72మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,378 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

ఏర్పేడు, జూలై 14: ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన వృద్ధుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఏర్పేడు మండలంలో వారం కిందట జరిగిన ఈ సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూడటంతో ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం నిందితుడైన బలరామయ్యగౌడ్ (61)ను సీఐ శ్రీరామ శ్రీనివాసులు అరెస్టు చేశారు. సోమవారం ఉదయం 11గంటలకు రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో పడకేసిన పాలన

- 774 పంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శులు 351 మంది

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14: వైసీపీ పాలనలో పంచాయతీలను నిర్వీర్యం చేసిన విషయం తెలిసిందే. మరోవైపు అప్పటి ఎమ్మెల్యేలు సైతం ఎంపీడీవోలను అడ్డుపెట్టుకుని ఇన్‌చార్జి కార్యదర్శులుగా నాలుగైదు పంచాయతీలకు ఒకరినే నియమించుకుని పాలనను పడకేసేలా చేశారన్న విమర్శలున్నాయి. జిల్లాలో 774 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 351 పంచాయతీల్లో మాత్రమే రెగ్యులర్ కార్యదర్శులు పనిచేస్తున్నారు. 260 పంచాయతీల్లో సచివాలయాల్లోని గ్రేడ్-5 కార్యదర్శులను నియమించి అప్పటి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. దీని కారణంగా గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రి పాలవుతున్న జనం

చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గాల్లో అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల ఆదేశాలతో ఎంపీడీవోలు తమకు అధికారం లేకపోయినా మేజర్ పంచాయతీల్లో కార్యదర్శులను తొలగించి.. మూడు, నాలుగు పంచాయతీలకు ఓ కార్యదర్శినే డిప్యుటేషన్‌పై నియమించారు. దీనివల్ల సుమారు 400పైగా పంచాయతీల్లో పరిపాలన అస్తవ్యస్తంగా తయారైంది. మౌలిక వసతులు కరువై.. సీజనల్ వ్యాధులతో జనం ఆస్పత్రి పాలవుతున్నారు. ఇప్పటికైనా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ కార్యదర్శులను నియమించి.. పంచాయతీ పాలనను గాడిలో పెట్టాలని జనం కోరుతున్నారు.

కోటలో అత్యధిక వర్షపాతం

- 57.2 మి.మీ. నమోదు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14: జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. కోట మండలంలో అత్యధికంగా 57.2మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. దొరవారిసత్రంలో 51.2, చిట్టమూరులో 46.2, నాయుడుపేటలో 35.8, తిరుపతి అర్బన్‌లో 26.6, వడమాలపేటలో 26.4, సూళ్లూరుపేటలో 21.4, తడలో 18.8, చిల్లకూరులో 18.4, పెళ్లకూరులో 18, గూడూరులో 17.6, తొట్టంబేడులో 17.2, ఓజిలిలో 16.4, బుచ్చినాయుడుకండ్రిగలో 16.2మి.మీ.వర్షం కురిసింది. ఆదివారం కూడా చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. కూరగాయల పంటకు పాక్షికంగా నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు.

సహకార సంఘాలకు మంచిరోజులు

- జగన్ జమానాలో గాడి తప్పిన పీఏసీఎస్‌లు
- ఎన్నికలు నిర్వహించకుండా పార్టీ నేతల పెత్తనం
- పర్సన్ ఇన్‌చార్జులుగా అధికారుల్ని నియమించిన కొత్త ప్రభుత్వం
- సంఘాలు గాడిన పడతాయని రైతుల ఆశాభావం



నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

గూడూరు అర్బన్, జూలై 14: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్) సారథులు లేక నిస్తేజంగా తయారయ్యాయి. దశాబ్దం క్రితం జరిగినవే చివరి ఎన్నికలు. వైసీపీ ప్రభుత్వం మినహా అన్ని ప్రభుత్వాలు సహకార ఎన్నికల నిర్వహణ - రైతుల సంక్షేమంపై దృష్టి పెట్టాయి. జగన్ సర్కార్ ఐదేళ్లలో కనీసం ఎన్నికలు కూడా నిర్వహించలేకపోయిందనే అపవాదు మూటకట్టుకుంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి త్రీమెన్ కమిటీలతో కాలక్షేపం చేసేసింది. 11 సార్లు నామినేటెడ్ కమిటీలను కొనసాగించి అనుచరులకు పట్టం కట్టింది.

ఎన్నికల ఊసేలేదు

జిల్లాలో 80 పీఏసీఎస్‌లు ఉన్నాయి. 2013 ఫిబ్రవరిలో వీటికి ఎన్నికలు జరిగాయి. అప్పట్లో మెజార్టీ సొసైటీలను వైసీపీ కైవసం చేసుకుంది. కేంద్రసహకార బ్యాంకు అధ్యక్షుడిగా ధనుంజయరెడ్డి ఎన్నికయ్యారు. 2018 ఫిబ్రవరి నాటికి పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి నామినేటెడ్ పాలకవర్గాలు కొన...సాగాయి. 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో అప్పటి చంద్రబాబు సర్కారు 6నెలల చొప్పున రెండుసార్లు పాలకవర్గాలను పొడిగించింది. జగన్ ప్రభుత్వం కొలువుదీరాక ఎన్నికల జోలికి వెళ్లలేదు. కేంద్ర సహకార బ్యాంకుకు మెట్టుకూరు తరువాత ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా నామినెట్ కాగా జిల్లా పరిషత్ ఎన్నికల తరువాత ఆయన సతీమణి అరుణమ్మ జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఆయన స్థానంలో పెళ్లకూరుకు చెందిన వైసీపీ నాయకుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కొలువుదీరారు. మొన్నటి వరకు ఆయనే నామినేట్ ఛైర్మన్‌గా పెత్తనం చేశారు. జగన్ పాలనలో సహకార సంఘాలు జీవాన్ని కోల్పోయాయి. వైసీపీకి చెందిన ముగ్గురు త్రీమెన్ కమిటీగా నియమితులై పెత్తనం చేశారు. రైతులకు సేవలందించే ప్రధాన బాధ్యతను ఈ కమిటీలు పూర్తిగా పక్కన పెట్టాయి. సొసైటీ నిధులు- రుణాలను ఇష్టారీతిలో కొల్లగొట్టాయనే ఆరోపణలున్నాయి. యంత్ర సేవా కేంద్రాలనూ పూర్తిగా నిర్వీర్యం చేశాయి. యంత్రాలనే మాయం చేసేశాయి. ట్రాక్టర్లు, విత్తనాలు, మందుల పిచికారీ, దుక్కుల పనిముట్లు ఎక్కడా పనిచేయలేదు సరికదా... సొసైటీ కార్యాలయాలలోనూ కనిపించడంలేదు. రుణాల మంజూరులో కమిటీలదే సర్వాధికారం. వందలాది మంది మొండి బకాయిదారులుగా ఉన్నా తమకు గిట్టని, ప్రత్యర్థి పార్టీ వారిని భూముల వేలం పేరుతో వేధించారనే విమర్శలు ఉన్నాయి. బినామీ సభ్యుల పేర్లతో రుణాలు మంజూరు చేసుకుని పెద్దలు దోచుకున్నట్లు ఆరోపణలున్నాయి.

వ్యవసాయశాఖ మంత్రి ఆరా

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడటంతో సహకార సంఘాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందన్న ఆశలు అన్నదాతల్లో చిగురించాయి. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ ఎన్నిక ప్రక్రియపై ఆరా తీసినట్లు తెలుస్తుంది. త్వరలోనే ఎన్నికలు నిర్వహించి పాలనను గాడిలో పెట్టేందుకు ప్రతిపాదనలు- సూచనలు చేసినట్లు సమాచారం. జగన్ జమానా మాదిరి కాకుండా అధికారులనే సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించడంతో ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతుంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు జాయింట్ కలెక్టర్ సేధుమాధవన్‌ను పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించింది.

చెరువుల అభివృద్ధికి సహకరించండి

జల వనరుల శాఖ మంత్రి నిమ్మలకు పాశిం వినతి



మంత్రికి అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు అర్బన్, జూలై 14: నియోజకవర్గ పరిధి టలో చెరువుల అభివృద్ధికి సహకరించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి ఆదివారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ విన్నవించారు. ఆదివారం నెల్లూరు జిల్లాలోని సోమశిల, కండలేరు ప్రాజక్టుల పరిశీలనకు వచ్చిన మంత్రి నిమ్మలతోపాటు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఎమ్మెల్యే మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సోమశిల, కండలేరు జలాశాయల నుంచి గూడూరు నియోజకవర్గానికి నీటిని సరఫరా చేయడం ద్వారా ఇటు రైతులకు అటు ప్రజలకు నీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ, దేవాలయాల అభివృద్ధికి సహకరించాలని సంబంధిత శాఖ మంత్రులను కోరినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ సీనియర్ నాయకుడు కొండేపాటి గంగాప్రసాద్ కూడా ఉన్నారు.

ముత్యాలమ్మకు ఆదివారం పూజలు



చిల్లకూరు, జూలై 14: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మకు ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టారు.

కోటమ్మకు...



కోట, జూలై 14: కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

19న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నాయుడుపేట టౌన్, జూలై 14: నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 19వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌వర్మ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఐసీఐసీఐ బ్యాంక్ వారు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. డిగ్రీ, బీఎస్సీ, బీకాం, బీఏ, బీసీఏ, బీబీఏ పూర్తి చేసిన వారు, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా అర్హులని ఆయన తెలిపారు. 19వ తేదీ 10 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్‌తో పొంచి ఉన్న ప్రమాదం

- కాలువల్లో పేరుకుపోతున్న కవర్లు



వెంకటగిరి పట్టణంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు

వెంకటగిరి టౌన్, జూలై 14: ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరుగుతండటంతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. నిషేధిత ప్లాస్టిక్ వస్తులువు విక్రయిస్తున్న దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి వాటని స్వాధీనం చేసుకోవడమేకాకుండా సదరు యజమానికి జరిమానా విధించాల్సి ఉంది. అయితే ఇది సక్రమంగా అమలు కాకపోవడంతో వెంకటగిరి పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వస్తువులే కనిపిస్తున్నాయి. ఏ దుకాణంలో చూసినా ప్లాస్టిక్ కవర్లు విచ్చల విడిగా విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మోస్తరు వర్షం

వెంకటగిరి టౌన్, జూలై 14: పట్టణంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి చిరుజల్లులు కురిశాయి. ఆదివారం ఉదయం మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలకు ఊరట కల్గింది. ఆరుతడి పంటలు వేసుకున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

వెంకటగిరిటౌన్, జూలై 14: పట్టణంలోని నిరుపేదలకు స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో ప్రకృతి కుమార్ ఆదివారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఆదివారం పేదలకు ఏదో ఒక రూపంలో సాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్, గురవయ్య, రాంప్రసాద్, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పించండి

- తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి మునిరాజా



నరసింహయాదవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

సూళ్లూరుపేట, జూలై 14: కష్టకాలం, ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పించాలని తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి శివశంకర నాపా మునిరాజా అన్నారు. ఆదివారం ఆయన టీడీపీ నాయకులు, దేవాంగ సాధికార కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పార్టీ కష్టకాలంలో బలోపేతం కోసం కష్టపడ్డారని, వారికి నామినేటెడ్ పదవులు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుమహిళా నాయకురాలు బుద్ధి విజయలక్ష్మి, హరి, శారద, వెంకటేశ్, గిరి ప్రసాద్, నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దారి కోసం 10 గ్రామాల ప్రజల వ్యథ

- స్పందించని అధికారులు, రోడ్డు పనుల కాంట్రాక్టర్



పెసల గుర్రప్పతోట వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి

పెళ్లకూరు, జూలై 14 : మండలంలోని పెసల గుర్రప్పతోట సమీపంలో 71వ జాతీయ రహదారి నుంచి 10 గ్రామాలకు వెళ్లే దారి బురదమయంగా మారడంతో గ్రామీణులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా టెలికాం కేబుల్ లాగేందుకు దారి దిగే వద్ద పెద్ద గుంత తవ్వేశారు. దీంతో ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కప్పగుంటకండ్రిగ, పాలచ్చూరు, జంగాలపల్లి, దిరసనమాల, పెరుమాళ్లపల్లి, అనకవోలు, పిడికిటమాల, అనకవోలు తదితర గ్రామాలకు వెళ్లడానికి ఇదొక్కటే దారి. అయితే విస్తరణ పనుల్లో భాగంగా పెసల గుర్రప్పతోట వద్ద 71వ జాతీయ రహదారి దాటేందుకు ఎలాంటి క్రాసింగ్ వదలిపెట్టలేదు. ఇది ఆయా గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. జాతీయ రహదారి నుంచి 10 గ్రామాలకు వెళ్లే లింకు రోడ్డుకు మొదట్లో మట్టి పోశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుడడంతో బురదమయంగా మారింది. రోడ్డు ఛిద్రం కావడంతో వాహనదారులు జారి పడి గాయాలపాలవుతున్నారు. దీనికి తోడు ఆదివారం టెలికాం వైర్లు లాగేందుకు పెద్ద గుంత తవ్వేశారు. దీంతో ఈ దారిపై ప్రయాణించడానికి గ్రామీణులు భయాందోళన చెందుతున్నారు. ఇకనైన అధికారులు, స్పందించి రోడ్డు క్రాసింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గతంలో 71వ జాతీయ రహదారి ఆరు లేన్ల విస్తరణ పనులు చేపట్టే సమయంలో బాక్స్ టైప్ అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను ఈ ప్రాంత ప్రజలు వేడుకున్నా పట్టించుకోలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు, నూతన పాలకులు పట్టించుకోవాల్సి ఉంది.

రొచ్చుగా మారిన రోడ్లు



క్రాస్ రోడ్డులో చెరువును తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు - చిత్తడిగా మారిన అంబేద్కర్ గురుకులానికి వెళ్లే రోడ్డు

కోట, జూలై 14: పట్టణంలోని రోడ్లు రొచ్చుగా మారాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిత్తడి మారాయి. పట్టణంలోని అంబేడ్కర్ గురుకులానికి వేళ్లే దారి అడుసుమయంగా మారిపోయింది. ఆదివారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చూసుకునేందుకు వెళ్లిన అడుసు బురదలో తొక్కుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. సుమారు అర కిలోమీటరు వరకు ఉన్న ఈ రోడ్డు దుస్థితిలో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అదే విధంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, గోపాల్‌రెడ్డి విగ్రహం, క్రాస్‌రోడ్డులలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతినడంతో అటు పాదచారులు, ఇటు వాహనచోదకులను ఇబ్బందియి పడుతున్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగు



తిరుమూరు ఎస్సీకాలనీ రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు

వాకాడు: మండలంలోని తిరుమూరు ఎస్సీ కాలనీలో అధికారుల పర్యవేక్షణ లోపంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన సిమెంటు రోడ్డుపై చిన్నపాటి వర్షానికే మురుగు చేరింది. ప్రజలు ద్విచక్రవానాలలో వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. పాదచారులు నడవాలంటే నరక యాతన తలపిస్తోంది. రోజులతరబడి మురుగ నిలిచి ఉండటంతో దోమలకు ఆవాసంగా మారింది. రెండేళ్లుగా తిరుమూరు ఎస్సీకాలనీ వాసులు డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్‌తో రోజులుతరబడి ఆసుపత్రులపాలైన సందర్భాలున్నాయి. డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో మురుగు నిలిచి ఉండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

విద్యార్థిని మృతికి కారకులపై చర్యలు తీసుకోండి



గురుకులం వద్ద ధర్నాలో ప్రజా సంఘాల నాయకులు - గురుకులంలో విచారణ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

దక్కిలి, జూలై 14: పట్టణంలోని గురుకుల పాఠశాలలో 5వ తరగతి విద్యార్థిని షరీనా మృతికి సిబ్బందే కారణమని వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కళాశాలవద్ద ధర్నా చేపట్టారు. రాపూరు - వెంకటగిరిలో మార్గంలో చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడుతూ... ఘటనపై ఉన్నత స్థాయి అధికారులతో విచారణ చేపట్టే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా మంత్రుల పర్యటనకు హజరయ్యేందుకు దక్కిలి మీదుగా కండలేరు జలాశయం వద్దకు వెళ్తుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు గంగాప్రసాద్, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యంకు ఘటనను వివరించారు. వెంటనే వారు గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థి మృతి చెందినా ఇక్కడకు ఎందుకు రాలేదని ఆర్డీవోని ప్రశ్నించారు. వేరే విధుల్లో ఉన్నందున రాలేక పోయానని, తక్షణం ఘటనపై విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో నిరసనకారులు శాంతించారు. ధర్నాలో ఎమ్మార్పీఎస్ నాయకులు జి.మునెయ్య, ఎం.సురేష్, బీఎస్పీ నాయకుడు జి. వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో, గురుకుల కన్వీనర్ విచారణ

షరీనా మృతిపై ఆదివారం జిల్లా వైద్యాధికారి శ్రీహరి, తిరుపతి జిల్లా గురుకుల కళాశాల కన్వీనర్ పద్మజ వేర్వేరుగా విచారణ చేపట్టారు. విద్యార్థి మృతికి గల కారణాలపై ఆరాతీశారు. విద్యార్థినులను, ఉపాధ్యాయులను విచారించారు.

ఆహ్లాదాన్ని పంచని పార్కులు



ప్రహరీ కూలి అధ్వానంగా మారిన ఎన్టీఆర్ పార్కు

గూడూరు, జూలై 14: పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్కుల ఆలనాపాలనా లేకపోవడంతో దుస్థితికి చేరుకున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టకపోవడంతో పట్టణవాసులు ఆహ్లాదాన్ని కోల్పోయారు. గూడురు పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో గతంలో పార్కులను ఏర్పాటు చేశారు. అయితే కొనేళ్లగా నిర్వహణ మరిచిపోవడంతో నేడు అవి దుస్థితికి చేరుకుని నిరుపయోగంగా మారాయి. ప్రధానంగా పట్టణంలో ప్రజలు కొంతసేపు సేద తీరేందుకు పార్కులు నిర్మించి వాటిలో చెట్లను పెంచడంతో పాటు చిన్నపిల్లలు ఆటలు ఆడుకునేందుకు అనేక సౌకర్యాలను కల్పించారు. నేడు వాటి ప్రహరీలు కూలిపోయి, పిచ్చిచెట్లు పెరిగిపోయి అధ్వానంగా మారాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో నేడు దుస్థితిలో పార్కులు చేరుకున్నాయి. ప్రధానంగా పట్టణంలో సీవీసీ, పీఎస్ఆర్, వైఎస్ఆర్, ఎన్టీఆర్, సర్వేపల్లి రామారావు, అన్నంగి బాబురావు, రామ్‌నగర్ పార్కులను మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పార్కుల నిర్వహణను చేపట్టకపోవడంతో రెండు పార్కులు మినహా ఐదు పార్కులు దుస్థితికి చేరుకున్నాయి. గతంలో సిబ్బంది కొరత కారణంగా పార్కుల నిర్వహణ కష్టతరంగా ఉండేది. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండడంతో పార్కులను అభివృద్ధి చేసి సచివాలయ సిబ్బందిని ఇన్‌చార్జులుగా ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు ఆహ్లద వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మూతపడ్డ అన్నంగి బాబురావు పార్కు

రక్షణగోడ లేక ప్రమాదాలు



గూడూరు, జూలై 14: స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని కాలువ వద్ద రక్షణ గోడ లేకపోవడంతో వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని వాహన చోదకులు చెబుతున్నారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలో పంట కాలువపై నిర్మించిన రక్షణ గోడ కొన్నేళ్లక్రితం కూలిపోయింది. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో రక్షణగోడ లేకపోవడంతో కాలువ కనిపించక వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రక్షణగోడను ఏర్పాటు చేయడం కానీ, సూచికబోర్డును ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పేదలకు ఇసుక అందించేలా చర్యలు తీసుకోండి

సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

గూడూరు, జూలై 14: పేదలందరికీ ఇసుక అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో సీపీఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక పాలసీ కారణంగా భవన నిర్మాణ రంగంతోపాటు అనుబంధ రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చినా... క్షేత్ర స్థాయిలో డంపింగ్ యార్డ్‌ల వద్ద వందలాది వాహనాలు క్యూలైన్లలో ఉండడంతో పేదలకు ఇసుక అందని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ సమస్యలను పరిష్కరించి పేదలకు ఇసుక కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల 22న తిరుపతిలో జరిగే జిల్లాస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కాలేషా, శశికుమార్, ప్రసాద్, సీవీఆర్‌కుమార్, చంద్రయ్య, నారాయణ, రమేష్, భాస్కర్, కృష్ణ, శేషయ్య, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలను స్మరించుకుందాం

కోట, జూలై 14: మహనీయుల త్యాగాలు, పోరాటాలు వృథా కానీ వ్వకుండా ఐక్యంగా కలసి పోరాడేందుకు బహుజనులంతా ఒకే వేదికపైకి రావాలని బహుజన ఐక్యవేదిక నాయకులు అన్నారు. కోటలోని షాదీమంజిల్‌లో ఈనెల 17న బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో కారంచేడు స్ఫూర్తి సభ జరుగుతుంది. ఈ సభ కరపత్రాలను ఆదివారం బహుజన ఐక్యవేదిక, బీఎస్పీ నాయకులు ఎం.మాధవ్, దాసరి సుందరం, రంగనాథ్, అశోక్‌కాంబ్లే గ్రామాల్లో పంచిపెట్టారు.. గూడలి, రుద్రవరం, ఊనుగుంటపాళెం, తిన్నెలపూడి, నెల్లూరుపల్లి కొత్తపాళెం, అగ్రహారం గ్రామాల్లో బహుజన ఐక్యవేదిక సభకు వేలాదిగా తరలిరావాలంటూ పిలుపునిచ్చారు.

బ్రాహ్మణులకు అండగా నిలుద్దాం

కోట, జూలై 14: నిరుపేద బ్రాహ్మణులకు అండగా నిలిచి అన్ని విధాలా ఆదుకుంటామని శ్రీపట్టాభిరామ బ్రాహ్మణ సేవా సంఘ నాయకులు తెలిపారు. మండలంలోని విద్యానగర్‌లో ఆదివారం సంఘ జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ ఉపాధ్యక్షుడు యామానరావు, సోమకుమార్‌తోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన కెప్రసాదరావు, కె.సుధాకరరావు, సీతారామరావును సత్కరించారు. ఆగస్టులో విద్యానగర్‌లో నూతన బ్రాహ్మణ భవనం ప్రారంభంపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. శివకుమార్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

భూపతేశ్వరుడికి ప్రత్యేక అభిషేకం



చిట్టమూరు, జూలై 14: మండలంలోని యాకశిరితిప్పలో కొలువై ఉన్న భూపతేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకాలతో పాటు ప్రత్యేక అలంకరణ నిర్వహిస్తారు. అందులో భాగంగా పాలు, పెరుగు, తేనె సహా వివిధ రకాల పండ్లతో అభిషేకించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నదానం జరిగింది.

తుమ్మూరులో కుక్కల స్వైరవిహారం

భయాందోళనలో స్థానికులు



కుక్కలదాడిలో గాయపడ్డ విద్యార్థిని (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట, జూలై 14: మున్సిపాలిటీ పరిధిలోని 1, 23 వార్డుల్లో విస్తరించి ఉన్న తుమ్మూరులో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కుక్కలు దాడి చేసుకుంటూ అటుగా వచ్చిన స్థానికులపై పడుతున్నాయి. ఇటీవల కుక్కలు పొట్లాడుకుంటూ తుమ్మూరు వద్ద పాత జీఎన్‌టీరోడ్డు దాటుతున్న నాల్గో తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిని గాయపరిచాయి. అలాగే నా యుడుపేట పట్టణంలోని చిన్న దర్గావీధి, అమరా గార్డెన్, రామకృష్ణాపురం, రాజగోపాలపురం, భరత్‌నగర్, అగ్రహారపేటల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మున్సిపాలిటీలో గత 3 సంవత్సరాలుగా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించలేదు. దీంతో కుక్కల సంతతి పెరిగింది.వీధి కుక్కలను పట్టి తిరుపతిలో కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయించడానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి చెప్పారు.